website:www.netinijam.com
తెలుగు దినపత్రిక
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 9-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 89 | పేజీలు: 8 | వెల: రూ.1/-

## అయోధ్యలో భారీ బందోబస్తు : 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

లక్నో,నవంబర్8(ఆర్ఎన్ఎ): అయోధ్యలోని రామ జన్మభూమి ఉ బాబ్రీ మసీదు స్థల వివాదంపై సుప్రీంకోర్టు ఈ నెల 17వ తేదీలోగా తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధమయింది. అయోధ్యలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

అయోధ్యలో హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. లక్నోలో కూడా హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువారం నాడు జిల్లా మెజిస్ట్రేట్స్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని ప్రయత్నించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. 24 గంటలపాటు పని చేసే మాస్టర్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్‌పిలు, జిల్లా మెజిస్ట్రేట్లు అన్ని మతాలకు చెందిన నాయకులను కలుస్తుండాలని ఆయన అన్నారు. పెట్రోలింగ్‌ను పెంచాలని, శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేశారు.

### ఆర్టీసీ ప్రైవేటీకరణ పిటీషన్‌పై

# విచారణ వాయిదా!

**- పిటీషనర్ అభ్యంతరాలపై కౌంటర్ దాఖలు చేయాలన్న హైకోర్టు**
**- 11కు విచారణ వాయిదా వేసిన న్యాయస్థానం**
**- ఆలోపు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచన**

హైదరాబాద్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ఆర్టీసీలో 5,100 రూట్ల ప్రైవేటీకరణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తదుపరి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. టీఎస్ఆర్టీసీలో ప్రైవేటు బస్సులకు అనుమతిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తెజస ఉపాధ్యక్షుడు విశ్వేశ్వరరావు దాఖలు చేసిన వ్యాజ్యంపై ఉన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ విషయంలో మంత్రివర్గ నిర్ణయాలను తమ ముందుంచాలని ఆదేశించింది. పిటిషనర్ అభ్యంతరాలపై కౌంటర్ దాఖలు చేయాలని అదనపు అడ్వకేట్ జనరల్‌ను ఆదేశిస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది. రాష్ట్ర కేబినెట్ ప్రొసీడింగ్స్‌ను తమ ముందు ఉంచాలని తెలిపింది. సోమవారం వరకు ఆర్టీసీ రూట్ల ప్రైవేటీకరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదిలాఉంటే అదే రోజు ఆర్టీసీ సమ్మె, కార్మికుల జీతాల నిలుపుదలకు సంబంధించి కూడా హైకోర్టు విచారణ చేపట్టనుంది. గురువారం ఆర్టీసీ సమ్మె, కార్మికుల జీతాల నిలుపుదల, ఆర్టీసీ ప్రైవేటీకరణకు సంబంధించిన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కార్మికులతో చర్చలు జరపాలని మరోసారి ప్రభుత్వానికి సూచించింది. అధికారులు సమర్పించిన లెక్కలు గజిబిజిగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రజల పట్ల చూపాల్సింది అధికారం కాదని.. ఔదార్యం అని సూచించింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నామవరపు రాజేశ్వం రావు వాదనలు వినిపిస్తూ.. టీఎస్ఆర్టీసీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం తమ వద్ద నుంచి అనుమతి తీసుకోలేదని అన్నారు.

## అమెరికా ఎన్నికల్లో గెలిచిన హైదరాబాద్ మహిళ

వాషింగ్టన్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : అగ్రరాజ్యం అమెరికాలో హైదరాబాద్ మహిళ గజాలా హష్మీ చరిత్ర లిఖించారు. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో టెన్త్ సెనేట్ డిస్ట్రిక్ట్ నుంచి డెమొక్రటిక్ పార్టీ తరఫున సెనేటర్‌గా గెలిచారు గజాలా. రిపబ్లికన్ అభ్యర్థి, సిట్టింగ్ సెనేటర్ గెన్ సరేవాంట్‌ను గజాలా హష్మీ ఓడించారు. ఈ విజయంతో వర్జీనియా సెనేట్‌కు ఎన్నికైన తొలి మహిళా ముస్లిం–అమెరికన్‌గా, తొలి ఇండియన్–అమెరికన్‌గా హష్మీ రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట ఐజా ఉన్నత పాఠశాలలో చదువుకున్న గజాల, దశాబ్దాల క్రితమే అమెరికాకు వెళ్లిపోయారు. జార్జియా వర్సిటీ నుంచి బీఏ ఇంగ్లిష్ అభ్యసించిన ఆమె అక్కడే పీహెచ్‌డీ కూడా చేశారు. హైదరాబాద్‌లో చదువుకునేటపుడు తోటి విద్యార్థులు ఆమెను 'మున్నీ' అని పిలిచేవారు. ఆమెకు భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అమెరికాలోని వలు రాష్ట్రాల, స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన భారత సంతతి నేతల్లో శ్వేతసౌధ మాజీ సాంకేతిక విధాన సలహాదారు సుహాస్ సుబ్రహ్మణ్యం కూడా ఉన్నారు. ఆయన వర్జీనియా రాష్ట్ర ప్రతినిధుల సభకు ఎన్నికవగా.. కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో పబ్లిక్ డిఫెండర్ కార్యాలయ సభ్యుడిగా మనో రాజు, ఉత్తర కరోలినా షార్లెంట్ మండలి సభ్యురాలిగా డింపుల్ అజ్మీరా గెలుపొందారు.

# మూడు రోజుల్లో.. అయోధ్య తీర్పు!

**- అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్రం సూచన**
**- సున్నితమైన ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం**
**- యూపీలోని అయోధ్యకు 4వేల పారామిలిటరీ దళాలు**
**- యూపీ సీఎస్, డీజీపీలతో సీజేఐ భేటీ**

న్యూఢిల్లీ, నవంబర్8(ఆర్ఎన్ఎ) : దాదాపు శతాబ్ద కాలం నుంచి కొనసాగుతోన్న అయోధ్యలోని రామజన్మభూమి– బాబ్రీ మసీదు భూవివాదం అంశంపై సుప్రీం కోర్టు తీర్పు మరో రెండు మూడు రోజుల్లో తీర్పును వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని పేర్కొంటూ హోం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచనలు జారీ చేసింది. ఇప్పటికే ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యకు 4వేల మంది పారామిలిటరీ దళాలను తరలించినట్లు హోంశాఖ అధికార వర్గాలు తెలిపాయి. అలాగే ఆయా రాష్ట్రాలు సైతం సున్నిత ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచాలని హోంశాఖ సూచించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చూసుకోవాలని కోరింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయి పదవీకాలం ఈ నెల 17తో ముగియనున్న నేపథ్యంలో ఆ లోపే అయోధ్య తీర్పును వెలువరించే అవకాశం ఉంది. సున్నితమైన అంశం కావడంతో ప్రభుత్వం, మత సంస్థలు కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి కోసం కృషి చేస్తున్నాయి. మరోవైపు, అయోధ్య, లక్నోలో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు యూపీ ప్రభుత్వం తెలిపింది. అత్యవసరమైతే వినియోగించడానికి రెండు హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచుతామని సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి అత్యవసరంగా పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితిపై సీఎం ఆరా తీసి, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పినట్టు అధికారులు వెల్లడించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించవద్దని ఆదేశించారని అన్నారు. లక్నోలో స్టేట్ లెవెల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు ప్రతి జిల్లాకు ఓ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. మరోవైపు, యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను శుక్రవారం ఢిల్లీకి పిలిపించిన చీఫ్ జస్టిస్ గొగొయ్ వారితో సమావేశం అయ్యారు. అయోధ్య తీర్పు అనంతరం ఎలాంటి ఘటనలు జరక్కుండా తీసుకోవాల్సిన చర్యల గురించి కీలక సూచనలు చేశారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లోనూ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయోధ్య తీర్పు నేపథ్యంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

### బంగారు గని కూలి

# 10 మంది మృతి



కోనార్కా(గనియా),నవంబర్ 8 (ఆర్ఎన్ఎ): గనియా దేశంలో ఘోర దుర్ఘటన చోటు చేసుకుంది బంగారు గని కూలి 10 మంది చనిపోయారు. గనియా ఈశాన్య ప్రాంతంలోని కోనార్కీ సమీపంలో ఉన్న బంగారు గని ప్రమాదవశాత్తూ కూలిపోయింది.

ప్రమాదం జరిగిన సమయంలో గనిలో ఉన్న 10 మంది సజీవ సమాధి అయ్యారని రెడ్ క్రాస్ ప్రతినిధులు తెలిపారు. అయితే గనిలో 10 మంది కంటే ఎక్కువగానే కార్మికులు ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గనిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

## ఫ్లై ఓవర్ కింద మురికివాడలో భారీ అగ్ని ప్రమాదం

లక్నో,నవంబర్7(ఆర్ఎన్ఎ): లక్నోలోని విభూతి ఖండ్ ప్రాంతంలో ఫ్లై ఓవర్ కింద ఉన్న మురికివాడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తోంది. మరిన్ని వివరాలు అందాల్సి ఉంది.

## ధాన్యం నిల్వ గోదాంను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల,నవంబర్ 8 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. పర్యటనలో భాగంగా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులో నిర్మించిన ధాన్యం నిల్వ గోదాంను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ గోదాంను రూ. 3 కోట్లతో నిర్మించారు. గోదాం సామర్థ్యం ఐదు వేల మెట్రిక్ టన్నులు. ఆ తర్వాత జిల్లెల్ల గ్రామంలోనే ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ పనులకు కేటీఆర్ భూమి పూజ చేశారు. ఈ సెంటర్‌ను రూ. 5.71 కోట్ల నిధులతో నిర్మించనున్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ కృష్ణ భాస్కర్, టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లుతో పాటు పలువురు పాల్గొన్నారు.



# కేసీఆర్ తక్షణమే రాజీనామా చేయాలి

**- తీరుమార్చుకోకపోతే రావణాసుడికి పట్టిన గతే పడుతుంది**
**- అధికారులకు అవమానం జరిగితే ప్రభుత్వానికి జరిగినట్లే**
**- నిజాం కాలంలో ఆవిర్భవించిన ఆర్టీసీని కేసీఆర్ ప్రైవేట్ చేయాలని చూస్తున్నాడు**
**- ఎంఐఎం ప్రభుత్వం నుంచి ఇప్పటికైనా బయటకు రావాలి**
**- చలో ట్యాంక్ బండ్‌ను చేసి తీరుతాం**
**- భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి**
**- అఖిలపక్షం నాయకులు**

హైదరాబాద్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : సీఎం కేసీఆర్ నయా నజాంలా మారాడని, హైకోర్టు ఎన్నిసార్లు హెచ్చరికలు చేసినా బేఖాతర్ చేస్తూ నియంతలా వ్యవహరిస్తున్నాడని, కేసీఆర్ తక్షణమేరాజీనామా చేయలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మగ్దూం భవన్‌లో అత్యవసరంగా ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, టీటీడీపీ అధ్యక్షుడు ఎల్. రమణలు, సీపీఐ తెలంగాణ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ..

ప్రజలకు అవమానమని భావించి తక్షణమే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని పేర్కొన్నారు ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే రావణాసురుడికి పట్టిన గతే పడుతుందని విమర్శించారు. నిజాం కాలంలో ఆవిర్భవించిన ఆర్టీసీని నయా నిజాం కేసీఆర్ ప్రైవేట్ పరం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మండిపడ్డారు. ఆర్టీసీని కాపాడేందుకు ఎంఐఎం ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి బయటకు రావాలని నారాయణ సూచించారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నప్పటికీ.. ప్రభుత్వానికి ఎంఐఎం ఇప్పటికి కూడా మద్దతివ్వడంపై విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే చలో ట్యాంక్ బండ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. హైకోర్టు ప్రైవేట్ బస్సులకు రూట్ పర్మిట్‌పై స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రయివేట్ బస్సులు ప్రవేశపెట్టేందుకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి ప్రయత్నిస్తే.. కోర్టు స్టే ఇవ్వడంతో ఆయన ఏకంగా సీఎం పదవికే రాజీనామా చేశారని గతాన్ని గుర్తు చేశారు. కోర్టులో సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లకు అవమానం ఎదురైతే.. ప్రభుత్వానికి కూడా అది అవమానమే అని కేసీఆర్ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి, అధికారులకు అవమానం జరిగితే.. తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలకు అవమానమని భావించి తక్షణమే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తీరు మార్చుకోకపోతే రావణాసురుడికి పట్టిన గతే పడుతుందని విమర్శించారు. హైకోర్టు 11న ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలిచేందుకు అవకాశం ఇచ్చిందని.. ఇప్పటికైనా వారిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. రాష్ట్ర రెండో రాజధానిపై విద్యాసాగర్ రావు చేసిన వ్యాఖ్యలకు.. సొంత పార్టీ వారు సంబంధం లేదంటే.. ఆయన మాత్రం తన వ్యక్తిగత అభిప్రాయ మని చెప్పడం ఏమి బాలేదన్నారు. కేవలం ఆర్టీసీ సమస్యను పక్కదారి పట్టించేందుకే విద్యాసాగర్ రావు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నరని ధ్వజమెత్తారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ.. చట్టాలు పక్కన పెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లు చేయడం వల్లే.. నేడు ఐఏఎస్ అధికారులకు కోర్టు బోనులో తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఐదున్నరేళ్ల కేసీఆర్ ప్రభుత్వం పాలనలో కోర్టు ఎన్నో మొట్టికాయలు వేసిందని అన్నారు. ప్రైవేట్ బస్సులకు రూట్ పర్మిట్‌పై కోర్టు స్టే ఇచ్చిందని, దీనిపై కేసీఆర్ ఏం సమాధానం చెబుతారని ఎద్దేవా చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు తక్షణమే ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలవాలని పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయారెడ్డి సజీవదహనం ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలానే రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని.. ఏమాత్రం ప్రశాంతత లేదని.. ఉద్యమాలు అణచడానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఛలో ట్యాంక్ బండ్‌ను విజయవంతం చేయాలని అందరిని కోరారు.

## హైదరాబాద్ మీర్‌పేట్‌లో పేలుడు..

హైదరాబాద్,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పేలుడు కలకలం రేపింది. విజయపురి కాలనీలో చెత్త ఏరుకుంటున్న ఓ మహిళ డబ్బాను నేలకేసి కొట్టడంతో ఈ పేలుడు చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విజయపురి కాలనీలో చెత్త ఏరుకునే మహిళకు చెత్తకుప్ప సమీపంలో డబ్బా దొరికింది. దీంతో ఆమె డబ్బాను తెరిచేందుకు యత్నించింది. అయితే డబ్బా తెరుచుకోకపోవడంతో.. దానిని నేలకేసి కొట్టింది. దీంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో చెత్త ఏరకునే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## ఎస్సై వివాహేతర సంబంధం.. భార్య ఆందోళన

హైదరాబాద్,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ ఎస్సై ఇంటి వద్ద ఆయన భార్య ఆందోళనకు దిగింది. నాచారం పీఎస్ పరిధిలోని మల్లాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మహేశ్వరం ఎస్సై నర్సింహకు.. మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంధువులతో కలిసి మహిళ ఇంటి వద్ద నర్సింహ భార్య ఆందోళన చేపట్టింది. భార్య, ఆమె బంధువులను చూసిన నర్సింహ అక్కడి నుంచి పరారయ్యాడు. ఓ కేసులో నర్సింహ సస్పెండ్ కావడం గమనార్హం. నర్సింహపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడే చలో ట్యాంక్‌బండ్

**- అనుమతి నిరాకరించిన ప్రభుత్వం**
**- ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు**
**- ట్యాంక్ బండ్‌వైపు ఎవరొచ్చినా అరెస్టు చేస్తాం**
**- స్పష్టం చేసిన సీపీ అంజనీకుమార్**
**- అఖిలపక్షం నేతల విజ్ఞప్తిని తిరస్కరించిన సీపీ**
**- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ అఖిపక్షం నాయకులు**
**- చలో ట్యాంక్‌బండ్ చేసి తీరుతామని వెల్లడి**
**- రాత్రి వరకు హైదరాబాద్ చేరుకోవాలని కార్మికులకు అశ్వత్థామ పిలుపు**
**- ముందస్తు అరెస్టు చేస్తున్న పోలీసులు**
**- ట్యాంక్‌బండ్ సమీప ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు**

హైదరాబాద్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ జేఏసీ నేతలు శనివారం తలపెట్టిన సకల జనుల సామూహిక దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించారు. సామూహిక దీక్షకు అనుమతి ఇవ్వలేమని సీపీ అంజనీకుమార్ ఖరాఖండిగా చెప్పారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్యాంక్ బండ్ వైపు ఎవరొచ్చినా అరెస్టు చేస్తామన్నారు. గురువారం అఖిల పక్ష నేతలు కోదండరామ్, ఎల్.రమణ, తమ్మినేని వీరభద్రం, చాడా వెంకట్ రెడ్డి, నారాయణ నేతృత్వంలోని కొందరు అఖిలపక్ష నేతలు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ను కలిసి చలో ట్యాంక్ బండ్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే సామూహిక దీక్షకు సీపీ అనుమతి నిరాకరించారు. శనివారం ఎవరైనా ట్యాంక్ బండ్ వచ్చినా, చట్టాన్ని తమ చేతిలోకి తీసుకేంటే వారందరినీ అదుపులోకి తీసుకుంటామన్నారు. కచ్చితంగా అరెస్టు ఉంటాయని చెప్పి సూచనప్రాయంగా చెప్పారు. దీంతో ఛలో–ట్యాంక్ బండ్ కార్యక్రమానికి అనుమతి కోరినా పోలీసులు ఇవ్వడం లేదని, ముందస్తు అరెస్టులు చేస్తున్నారని టీజేసీ అధ్యక్షుడు కోదండరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదేమైనా శనివారం మధ్యాహ్నం చలో ట్యాంక్ బండ్ జరిపి తీరుతామని కోదండరాం స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. హైకోర్టు మొట్టికాయలు వేసినా ముఖ్యమంత్రికి సోయి రావటం లేదని విమర్శించారు. ఏపీఎస్ ఆర్టీసీ నుంచి విడిపోకుండా.. విధానపరమైన నిర్ణయం తీసుకునే హక్కు టీఎస్ ఆర్టీసీకి లేదని ఆయన చెప్పారు. కేంద్రం అనుమతి లేకుండా.. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసే హక్కు కేసీఆర్‌కు లేదని వెల్లడించారు. కార్మికులకు మద్దతుగా సామూహిక నిరసన దీక్షలకు దిగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ముందస్తు అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని లేకుంటే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చలో ట్యాంక్ బండ్ కు అనుమతిని నిరాకరించటంతో ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరుమార్చుకోకపోతే ముమ్ముందు తీవ్ర అబాసు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికులను, అఖిలపక్షం నేతలను ముందస్తు అరెస్టు చేయడం ద్వారా చలో ట్యాంక్ బండ్ ముట్టడిని ఆపలేరని హెచ్చరించారు. ఖచ్చితంగా చలో ట్యాంక్ బండ్ ముట్టడి చేపడామని, కార్మికుల, అఖిలపక్షం నేతలంతా రాత్రి వరకు హైదరాబాద్ చేరుకొనేలా రావాలని, తద్వారా చలో ట్యాంక్ బండ్‌ను విజయవంతం చేసి ప్రభుత్వానికి మన సత్తాచూపుతామని అశ్వత్థామ కార్మికులకు పిలుపునిచ్చారు.

## ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్,నవంబర్ 8: ఆలయ భూముల ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదని,వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బొగ్గులకుంట లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమీక్ష నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ భూముల లీజ్ రెంట్లు, భూ రికార్డుల ప్రక్షాళన, ఆలయ భూముల వేలం ప్రక్రియలో పారదర్శకత, తదితర అంశాలపై మంత్రి అధికారులతో చర్చిస్తున్నారు.

ఆలయ భూముల వ్యవహారంలో దేవాదాయ శాఖ అధికారులు కూడా అలసత్వం విడనాడాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కమిషనర్ శ్రీనివాస రావు, డిప్యూటీ కమిషనర్లు, తదితరులు హాజరయ్యారు.

### చరిత్రలో నేటినిజం

కం॥ పువ్వుల వలె, నవ్వుల వలె
కవ్వించె చెడి మువ్వల వలె కవితలు నుడువన్
దువ్వూరు రామిరెడ్డిని
కవ్వడి సముడని దలచుచు కైమోడ్పెడదన్ !!



(నవంబర్ 9 దువ్వూరు రామిరెడ్డి జయంతి)

–రాధశ్రీ
సెల్: 9494481210

## ఒక్కరోజు కోర్టు హాజరు నుంచి వైఎస్ జగన్‌కు మినహాయింపు

హైదరాబాద్,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): సీబీఐ కోర్టులో ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి విచారణకు హాజరుకాలేదు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పర్యటన ఉన్నందున ఒక్క రోజు మినహాయింపు ఇవ్వాలంటూ కోర్టును జగన్ కోరారు. దీంతో జగన్ అభ్యర్థనను సీబీఐ కోర్టు అంగీకరించింది. అక్రమాస్తుల కేసు తదుపరి విచారణ ఈనెల 22కి వాయిదా వేసింది. వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరుతూ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. సీఎంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున తనకు మినహాయింపు ఇవ్వాలంటూ జగన్ కోర్టును అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. చట్టం ముందు అందరూ సమానమేనని, పదవిలో ఉన్న కారణంగా వ్యక్తిగత హాజరుకు మినహాయింపు కోరడం రాజ్యాంగంలోని 14వ అధికరణకు విరుద్ధమని కోర్టు పేర్కొంది.

# నేటి నగరాల పరిస్థితి!

నగరాన్ని కాలుష్యం పట్టి పీడిస్తోంది. అలాగని ఎవరినీ వాహనాలను వాడద్దు అనలేము. ఒక్కొక్కరికి ఒక కారు వాడుతున్న వారిని ఆపలేము. ఒక వెహికల్‌పై నలుగురు కూర్చుని వెళుతున్నా వద్దనలేము. ఎవరికి వారు కారు ఉండటం ఒక స్టేటస్‌గా అనుకుంటున్న ఈ కాలంలో వాటిని వాడకండి ఇక్కడ రోడ్లు ఇరుకుగా ఉన్నాయి అని అడ్డు పెట్టలేము. మరి రోజు రోజుకు పెరిగిపోతున్న జనాభా మధ్య ఒక్కొక్కరూ పడవలాంటి కార్లను వేసుకుని వస్తుంటే ఎలా చెప్పాలి? మరి దారేది? ప్రతి వాహనానికి ఎప్పటికప్పుడు పొల్యూషన్ చెక్ చేయించాలని చెబుతున్నా పట్టించుకోకుండా వెనక వస్తున్నవారిని రోగాల బారిన పడేస్తుంటే ఏమని చెప్పాలి? ఇవన్నీ వీరికి తెలియవనా? మరి దారేది? ఈ సమస్యలకు సమాధానం ఏది? ఉందా లేదా అంటే ఉంది. మొదట రహదారులను మెరుగుపరచడం, తద్వారా నగర వాతావరణంలో 33 శాతం దుమ్మును ఆపే వీలుంది. గ్రేటర్ లో రహదారుల శాతం తక్కువే. ఎక్కడైనా నగర విస్తీర్ణంలో 12.18 శాతం రోడ్లు అవసరం. మన నగరంలో అవి కేవలం 8-9 మాత్రమే. పోనీ అవైనా సరిగ్గా ఉన్నాయా అంటే అదీ లేదు. ఒక మోస్తరు వర్షం కురిస్తే చాలు ఛిద్రమవుతాయి. కొన్ని చోట్ల నదుల్లా ప్రవహిస్తాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లన్నీ కలుషితం చేస్తాయి. కనీసం ఒక్కో పెద్ద వర్షానికి ఒకరో ఇద్దరో ప్రాణాలు తీసుకుంటాయి. దాని వెనుకే దుమ్ము నిలుస్తుంది. ముందు ఒక పెద్ద వాహనం వెళితే వెనుక మనిషి కనిపించనంత కాలుష్యం కమ్ముకుంటుందంటే అతిశయోక్తి కాదు. ఇవి నేటి నగరాల పరిస్థితి! అయితే ఈ ట్రాఫిక్ తట్టుకునేందుకు ప్రత్యామ్నాయంగా వేస్తున్న రహదారుల్ని ఎంతకీ పూర్తి చేయలేకపోవడం ఉన్నవాటికి తాగునీరు, కేబుళ్లు, మురుగునీటి వ్యవస్థ కోసం నిత్యం తవ్వడం లాంటి కారణాలమూలంగా కాలుష్య తీవ్రత ఆందోళనకరంగా మారుతోంది. గాలిలో ప్రజారోగ్యానికి ప్రమాదకరమైన పలు సమస్యలు ఉంటాయి. ఉద్గారాలు ఉంటాయి. పరిమితంగా ఉంటే సమస్యలేకున్నా ప్రమాణాలను మించి ఉంటే మాత్రం మనిషి ఆరోగ్యానికి పర్యావరణానికి ప్రమాదం తప్పదు. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ వంటి గాలిలో ఉన్నా నిర్దేశిత ప్రమాణాలకు లోబడే నమోదు అవుతున్నాయి. ప్రస్తుతం నగరంలో ఆందోళన కలిగించేది దుమ్ము రేణువుల తీవ్రతే. ముఖ్యంగా పంజాగుట్ట, అబిడ్స్, కూకట్‌పల్లి, బాలానగర్, చార్మినార్ ప్రాంతాల్లో ఆందోళన కర స్థాయిలో నమోదవుతోంది. ఆ దుమ్ము నరనరాన ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో మనిషికి అత్యంత ప్రమాదకరమని వైద్యులు, పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. వైద్య వర్గాల సమాచారం ప్రకారం నగరంలో 20-25 శాతం మంది ఏదో ఒక శ్వాసకోస సంబంధ సమస్యతో బాధపడుతున్నారు. పీసీబీ అధ్యయనం ప్రకారం 30-40 వయస్సు మధ్య ఉన్నవారే అధికంగా ఉంటున్నారు. ఇకనైనా రహదారుల పట్ల, వాహనాల కాలుష్య నివారణ పట్ల కాస్తయినా శ్రద్ధ చూపితే బావుంటుందేమో!!

నేటి నిజం
శనివారం 9-11-2019

## ఆసరా పెన్షన్ల కోసం ఎదురుచూపు

### -నిధులులేవంటున్న అధికారులు

హైదరాబాద్,నవంబర్8(ఆర్ఎన్ఎ): జిల్లాల్లో నాలుగు నెలలుగా కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు కావడంలేదు. వివిధ విభాగాల్లో అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవడమే తప్ప అనుమతులు రావడం లేదు. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని స్పష్టమవుతోంది. పింఛన్ మొత్తాన్ని గణనీయంగా పెంచడం, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో కొత్త వారికి పెన్షన్ అందే పరిస్థితి లేకుండా పోయింది. నిరుపేదలకు ఆసరాగా ఉంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తమ కనీస అవసరాలు తీర్చుకునేందుకు ప్రభుత్వం ప్రతినెల ఆసరా పేరిట పింఛన్ విడుదల చేస్తోంది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాన్ని 2014 నుంచి గణనీయంగా పెంచుతూ వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో ఏర్పాటైన టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఆయా వర్గాలకు ఆసరా పింఛన్లను పెంచి అందిస్తోంది. అంతకుముందు వృద్ధులు, వితంతువులు, తదితరులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని రూ.200 నుంచి ఏకంగా రూ.1000కి పెంచారు. అలాగే వృద్ధులకు ఇచ్చే రూ.500ను రూ.1500కు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ఆసరా పెన్షన్ల పథకం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. తెలంగాణ ఆసరా పింఛన్ పథకం ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, గీతకార్మికులు, ఎయిడ్స్ బాధితులు లబ్దిపొందుతున్నారు. ఆసరా పథకానికి ప్రజల్లో మంచి ఆదరణ లభించడంతో మొన్నటి ముందస్తు అసెంబ్లీ ఎన్నికల వేళ పింఛన్లు రెట్టింపు చేస్తామని టీఆర్ఎస్ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ మేరకు వృద్ధులకు సహా ఆయా వర్గాలకు రూ.1000 ఉన్న ఆసరా పింఛన్‌ను రెట్టింపు చేస్తూ రూ.2016గా ప్రకటించింది. అలాగే వికలాంగులకు ఉన్న రూ.1500 పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. పెంచిన పింఛన్లు ఏప్రిల్ నుంచి ఇవ్వాలని ప్రభుత్వం భావించినా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ జూన్ నుంచి పంపిణీ చేస్తోంది. ఆసరా పింఛన్ పేరుకు తగిన విధంగా చేయూతనిస్తుండటంతో ప్రజల్లో మంచి స్పందన ఉంది. ప్రభుత్వం సూచించే అన్ని అర్హతలు ఉన్నందున తమకు ఆసరా పింఛన్ మంజూరు చేయాలంటూ జిల్లాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

## ఎంజిఎం కార్డియాలజీలో అసౌకర్యాలు

### గుండెపోటుతో వస్తే అంతే సంగతులు

వరంగల్,నవంబర్8(ఆర్ఎన్ఎ): మానవుడి జీవనశైలి గుండెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయక పోవడం, మానసిక ఒత్తిడితో గుండె ప్రమాదస్థితికి చేరుకుంటోంది. మానవుడి శరీరంలో గుండె అత్యంత ముఖ్యమైన అవయవం. ఇక్కడి నుంచే అన్ని భాగాలకు రక్తం సరఫరా అవుతుంది. అంతేగాకుండా గుండె అన్ని అవయవాలకు అనుసంధానించబడి ఉంటుంది. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధులు పెరిగిపోయాయి. చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. ఈ వ్యాధి పేద మధ్యతరగతి వర్గాలకు వస్తే ఇక అంతే సంగతులు. దేవుడి మీదే భారం వేయాల్సి వస్తోంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత పెద్దదైన వరంగల్ నగరంలోని పెద్దాసుపత్రి అయిన ఎంజీఎంలో గుండె చికిత్సకు అవసరమైన సౌకర్యాలు లేవు. వైద్యులు కూడా సరిపడా లేకపోవడం రోగులకు శాపంగా మారింది. 60 పడకలున్న కార్డియాలజీ విభాగంలో ఈమేరకు సౌకర్యాలు లేవు. కేవలం ఆరు పడకలు మాత్రం ఐసీయూలో ఉంచారు. గుండె వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించేందుకు సరైన పరికరాలు లేవు. కనీస పరీక్షలు చేసే పరిస్థితి కూడా లేదు. రోగులకు ఈసీజీ, ఎకో, ట్రాప్‌మిల్, టీఎమ్‌టీ వంటి పరీక్షలు చేయాలి. ఎంజీఎం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగంలో నలుగురు వైద్యులు ఉండాల్సిన అవసరం ఉండి.. కాని ఆ విభాగంలో ఒక్క డాక్టర్ విధుల్లో ఉన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన 14 మంది టెక్నీషియన్లు అవసరముండగా ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఎంజీఎంకు రోజుకు వెయ్యి నుంచి 15 వందల మంది రోగులు వస్తుంటారు. అందులో 40 శాతం గుండె నొప్పితో బాధపడే వారు ఉంటారు. వారిని ప్రథమ చికిత్స చేసేందుకు తొలుత ఈసీజీ చేయాలి. కాని ఆసుపత్రిలో దాతలు ఇచ్చిన 10 ఈసీజీలకు 3 మాత్రమే పని చేస్తున్నాయి. మిగితా 7 ఈసీజీలు మూలకు పడేశారు. ఇంత మంది రోగులకు ఈసీజీలు చేయాలంటే 3 పరికరాలు సరిపోక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈసీజీ కోసం గంటల తరబడి నిరీక్షించవలసి వస్తోందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం ఉన్నతధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించి పరికరాలను కొనుగోలు చేసేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

## నాగార్జునలో నిత్య వివాదాలు

### -ప్రతిష్ట దిగాజారుతోందంటున్న విద్యార్థులు

నల్లగొండ,నవంబర్8(ఆర్ఎన్ఎ): ఆచార్య నాగార్జునుడి పేరుతో ఏర్పాటుచేసిన విద్యాలయం వివాదాలమయంగా మారింది. స్వయం ప్రతిపత్తి గుర్తింపు తెచ్చుకున్న కళాశాల పేరును పలువురు అధ్యాపకులు దిగజారుస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు అధ్యాపకులను తాజాగా వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. అయితే ఆ ఇద్దరు అధ్యాపకులను బదిలీ చేయడం వెనుక ప్రిన్సిపాలే సూత్రదారి అని ఆయన కనుసన్నల్లోనే బదిలీ చేశారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తములుగా తయారుచేసిన ఎన్జీ కళాశాల నేడు తీవ్ర విమర్శల పాలవుతోంది.

కళాశాల ప్రతిష్ఠకు చెడ్డపేరు తెచ్చేలా ప్రస్తుత అధ్యాపకులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో ఒక వివాదంతో కళాశాల పేరు మసకబారుతోంది. కళాశాలలోని పరీక్షల విభాగం మొదలుకొని అన్ని విభాగాల్లో సమన్వయ లోపంతో విద్యార్థులు ఇబ్బందులెదుర్కొంటున్నారు.

అధ్యాపకుల నడుమ సఖ్యత లేకపోవడం, ఇరువురికి పోటీ ఎక్కువ కావడంతో ఒకరిపై ఒకరు దూషణలకు దిగి విద్యార్థులను పట్టించుకోకపోగా పోలీస్‌స్టేషన్ మెట్లెక్కిన సందర్భాలూ ఉన్నాయి. ఎన్జీ కళాశాలలో వివాదాలకు పరీక్షల విభాగం కూడా ఒక కారణంగా విద్యార్థులు

పేర్కొంటున్నారు. పరీక్షల విభాగానికి సంబంధించి పలువురు అధ్యాపకులు ఆధిపత్యం చెలాయించేలా తమ మాటే నెగ్గాలనే మంకుపట్టుతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మూడు నెలల క్రితం కళాశాల విడుదల చేసిన పరీక్ష ఫలితాలు తీవ్ర దుమారాన్ని లేపాయి. విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందగా విద్యార్థి సంఘాలు సైతం వారికి మద్దతుగా నిలిచి కళాశాలలో ధర్నాలు చేశాయి.

పరీక్షల విభాగం నిర్లక్ష్యంతో డిగ్రీలో కొన్ని సెమిస్టర్ల ఫలితాలు మాత్రమే విడుదల చేయడం, మిగతా సెమిస్టర్ల ఫలితాలు విడుదల చేయకపోవడంతో పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేయగా ఓ విద్యార్థి చెయ్యి కొసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. డిగ్రీ స్థాయిలో వచ్చే ఎన్‌సీసీ సర్టిఫికెట్లు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాయి.

డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉంటే పోలీస్ కొలువులతోపాటు ఇతర ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కోటా ఉంటుంది. అయితే ఎన్జీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం అధికారి పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. ఎన్‌సీసీ అధికారి బాధ్యత కోసం పోటీపడ్డ ఇద్దరు అధ్యాపకులు కళాశాలలో ప్రిన్సిపాల్ ఎదుటే తీవ్ర దూషనలకు దిగగా ఇన్‌చార్జిగా ఉన్న ఎన్‌సీసీ అధికారి నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మరో అధ్యాపకుడి పై ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

# గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా తాయిలాలు...?

హైదరాబాద్, నవంబర్ 8:ఏటా దేశంలో రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇతరత్రా తాయిలాలు ప్రకటిస్తూ ప్రభుత్వాలు రైతన్నలను మోసం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని..మార్కెట్‌కు తీసుకుని వచ్చిన పంటలను సకాలంలో కొనుగోలు చేయాలన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రధానంగా కంది, మిర్చి, పత్తి, ఎర్రజొన్న, పసుపు రైతులు బాధలు వర్ణనాతీతం. 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబంధు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవు తున్నాయి.

మిషన్ కాతీయ తదితర పథకాలతో చెరువుల్లో నీరు పెరిగి పంటల దిగుబడి పెరిగిందని ప్రభుత్వమే చెబుతోంది. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం షరా మామూలుగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్‌లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే. కానీ మార్కెట్ యార్డుల్లో పడిగాపులే రైతులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. దానికితోడు గిట్టుబాటు ధరలు రావు. అన్నీవున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఇప్పుడు కొనుగోళ్ల విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పెద్దగా కార్యాచరణ చేపట్టలేదు. పంట ఏదైనా డిమాండ్ ఉండదు. అమ్ముకోవడానికి నానా కష్టాలు పడాల్సిందే. రైతుబంధు కోసం బడ్జెట్‌లో 12వేల కోట్లు కేటాయించిన సిఎం కెసిఆర్ కూడా పంటల కొనుగోళ్లకు మాత్రం హామీ ఇవ్వడంలేదు. కెసిఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధును ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం కూడా పంటల కొనుగోళ్లకు సంబంధించి నిర్దిష్ట విధానాలు అమలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్, సిసిఐలు రంగంలోకి దిగినా ఫలితం దక్కడంలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ అంటూ అట్టహాసంగా ప్రకటనలు చేసినా రైతులకు మేలు చేకూర్చలేదు. పంటలను గిట్టుబాటు ధరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏటా రైతులు రోడ్డెక్కడం మామూలు విషయంగా మారింది. గిట్టుబాటు ధరలతో పాటు కొనుగోళ్ల కోసం పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువవడంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌కు ప్రజావాణిలో విన్నవించినా, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేసినా రైతుకు భరోసా దక్కడం లేదు. ఇప్పుడు వరి,పత్తి, సోయా తదితర పంటలు మార్కెట్‌కు వచ్చే కాలం. ఈ సమయంలో పక్కాగా కొనుగోళు సాగాలి. ధరలు దక్కాలి. దళారుల మోసాలు అరికట్టాలి. ఏటా పంట ఏదయినా జిల్లాల్లో పండించిన పంటలను కొనే దిక్కు లేకుండాపోయింది. గతేడాది పూర్తిస్థాయిలో రైతుల వద్ద కందులు కొనాల్సిన మార్క్‌ఫెడ్ సంస్థ అర్ధంతరంగా చేతులెత్తేసింది.

దీంతో రైతులు పంటను అమ్ముకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొనుగోలు చేసిన పంటకు కూడా నాణ్యత ప్రమాణాల పేరిట ఇబ్బందులకు గురి చేసిన మార్క్‌ఫెడ్ ఇక నుంచి కందుల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మార్కెట్ యార్డులకు తీసుకొచ్చిన కందులను తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకుని నష్టపోయారు. కంది పంటను కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్ అధికారులు రైతుకు కూడా డబ్బులు సకాలంలో చెల్లించలేదన్నారోపణలు ఉన్నాయి. దీంతో కార్యాలయం చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడ్డారు. పంటను కోసిన కూలీలకు డబ్బులు చెల్లించేందుకు అవస్థలకు గురవుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. రోజులు గడుస్తున్నా అధికారులు డబ్బులు మాత్రం అకౌంట్‌లో జమ చేయకపోవడంతో రైతులు బ్యాంకులు, కార్యాలయం చుట్టూ తిరుగుతూ నానా తంటాలు పడాల్సి వచ్చింది. కంది,మిర్చి రైతులు పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. వరంగల్ ఎనుమాముల మార్కెట్, ఖమ్మం మార్కెట్లలో మిర్చి రైతులు అవస్తలు చూస్తే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. మిర్చి ఉత్పత్తి పెరిగినా గిట్టుబాటు కాలేదు. ఏటా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోళ్లు చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి. మరోవైపు మార్కెటింగ్ శాఖకు ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరట్లేదు. ఇందుకు అనేక రకాల కారణాలు కనిపిస్తున్నాయి. కందులు, మొక్కజొన్నలకు ఫీజు మినహాయింపునివ్వడం, పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, కొన్ని చెక్‌పోస్టులు ఇతర జిల్లాల్లోకి వెళ్లడం, పౌరసరఫరాల శాఖ, సీసీఐ బకాయిల చెల్లింపు ప్రక్రియ పూర్తి కాకపోవడం వంటి కారణాలన్నీ కూడా అదనపు ఆటంకాలుగానే మారాయి. కందులు, మొక్కజొన్న పంటలకు ఒకశాతం మార్కెట్ ఫీజు మినహాయింపు నివ్వడం, పత్తి దిగుబడి తగ్గడంతో మార్కెటింగ్ ఆదాయంపై గట్టి ప్రభావం పడింది. దీనికి తోడు పౌరసరఫరాల శాఖ, కాటన్ కార్పొరేషన్ (సీసీఐ) ద్వారా బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ఆదాయ లక్ష్యాన్ని సాధించడంలో వెనుకంజలో ఉంది. కొన్ని గోదాములను ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు ఉపయోగిస్తుండగా, అత్యధిక గోదాముల్లో పౌరసరఫరాల శాఖ వారి ధాన్యం, సీసీఐ వారి పత్తిని నిల్వ ఉంచారు. వీటి ద్వారా రావాల్సిన ఆదాయ బకాయిలు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇదంతా కేవలం పక్కా మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, భారీగా పండుతున్న పంటలను కొనుగోలు చేసే వ్యూహం ప్రదర్శించడం లేదు. పంటల కొనుగోలు సమయంలో సరైన వ్యూహంతో ప్రభుత్వాలు చర్య తీసుకుంటే ఇబ్బందులు రావు.

# అకాల వర్షాలతో భారీగా పంట నష్టం

### అయినా బీమా సొమ్ముపై అపనమ్మకం

### నిబంధనల ఉచ్చులో రైతుకు అందని సాయం

నిజామాబాద్,నవంబర్8(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఈ ఖరీఫ్‌లో గత ఇరవై రోజులుగా కురిసిని వర్షాల కారణంగా పలు గ్రామాల్లో భారీగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ఈ సంవత్సరం కురుస్తున్న వర్షాల కారణంగా ఇరవై నుంచి ముప్పై శాతానికి పైగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నష్టం లెక్కల్లోకి రాదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధికారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న జిల్లాలోని రైతులకు పరిహారం అందేది నామమాత్రం గానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతున్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. ప్రతి యేడాది బీమా కంపెనీలు ఏడు నుంచి ఎనిమిది కోట్ల రూపాయల వరకు మాత్రమే పంట నష్టాన్ని అందజేస్తున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో 31,200 మంది రైతుల పంటలకు బీమా చేశారు. వారినుంచి రెండు శాతం పేరున 16.78 కోట్ల రూపాయలు వసూలు చేసి, వారు వేసిన పంటలకు బీమాను వర్తింపజేశారు. వర్షాలు కురియడం, పంట నష్టపోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ సంవత్సరం వర్షాల కారణంగా ఎక్కువ మొత్తంలో పంట నష్టం జరిగినందున పరిహారం వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయాధి కారులు మాత్రం పంట నష్టం వివరాల సేకరణ చేస్తున్నారు. జిల్లాలోని డిచ్పల్లి, నవీపేట్, ఆర్మూర్, మోర్తాడ్, ధర్పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లితోపాటు పలు మండలాల్లో పంటల పరిస్థితిని అధికారులు పరిశీలించి, నష్టం వివరాలను అంచనా వేస్తున్నారు. ఇప్పటికి నిబంధనల ప్రకారం ఐదొం దల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. పంట నష్టపరిహారం కూడా వ్యవసాయాధికారుల నివేదిక ఆధారంగానే ప్రభుత్వం మంజూరుచేస్తుంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులకు మాత్రం ఇది వర్తించదు. నివేదికలు కూడా వ్యవసాయాధికారులే ఇన్సూరెన్స్ కంపెనీకి పంపి, నష్టపరిహారం అందజేయాలని కోరుతారు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేశారు. బీమా ఆధారంగా ఐదేళ్లలో ఆ గ్రామ పరిధిలో వచ్చిన ఉత్పత్తి ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. దానికి అనుగుణంగానే బీమా కంపెనీలు నష్టపరిహారాన్ని అందజేస్తాయి. ఈ సంవత్సరం అనుకున్న రీతిలో రైతులు రుణాలు తీసుకోలేదు. బ్యాంకులు కూడా సగం లక్ష్యాన్నే పూర్తిచేశారు. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంట నష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. జిల్లాలో అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఎండబోసిన వరి ధాన్యంతోపాటు మొక్కజొన్న తడిసి ముద్దయిపోతుంది. ఈ యేడు పంటలకు వ్యాధులు లేవని, పంటలు బాగా ఉన్నాయని భావించిన రైతులకు ఈ వానలు గట్టి షాకిస్తున్నాయి. జిల్లాలో వేలాది ఎకరాల వరిపంట వర్షాల కారణంగా నేలకొరిగి, భారీగా దెబ్బ తింది. కొన్ని ప్రాంతాల్లో కోసిన ధాన్యం సైతం తడిసిపోయింది. భారీగా ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేసి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినా వర్షాల కారణంగా ఆ కేంద్రాలు ఖాళీగా ఉంటున్నాయి.

# వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

### గుంతల రోడ్లతో ప్రయాణికుల అవస్థలు

### పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు

కామారెడ్డి,నవంబర్8(ఆర్ఎన్ఎ): ఇటీవల కురిసిన వర్షాలు, వీటి పై నుంచి భారీ లోడ్‌తో వెలుతున్న వాహనాల కారణంగా బీ హైదరాబాద్- మెదక్- ఎల్లారెడ్డి- బాన్సువాడ బోధన్ రాష్ట్ర ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. చాలా చోట్ల మోకాలు లోతు గుంతలు పడి ప్రయాణికుల పాలిట శాపంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ రహదారిపై వాహనాల యజమానులు ప్రయాణించాలంటేనే జంకిపోతున్నారు. ఇక ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఈ రహదారిపై ఎల్లారెడ్డి పట్టణ శివారు నుంచి మొదలుకొని మెదక్ జిల్లా ఘన్‌పూర్ మండల కేంద్రం వరకు రోడ్డు చాలా వరకు ధ్వంసమైంది.

అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపట్ల వాహనాల యజమానులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవ హరిస్తున్నారని మండిపడుతున్నారు. కొంతమంది వాహన దారులు చేసేదేమీ లేక ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్‌కు ఇదివరకు మెదక్ నుంచి వెళ్లేవారు. కానీ ఇప్పుడు కామారెడ్డికి వెళ్లి అక్కడ్నుంచి హైదరాబాద్‌కు వెలుతున్నారు. ఈ రహదారి చాలా వరకు పూర్తిగా ధ్వంసం కావడంతో నూతన బీటీ రహదారిని ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నుంచి మెదక్ జిల్లా కేంద్రం వరకు సరిగ్గా 40 కిలోమీటర్ల దూరం.. ఈ రెండు జిల్లాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు.. ఈ రహదారిపై ఓవైపు వాహనాలు చెడి పోతుండగా, మరోవైపు భారీగా ఏర్పడిన గుంతలతో ఒళ్లంతా హూనమవుతోందని వారు వాపోతున్నారు. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదని తలలు పట్టుకుంటున్నారు. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలోని పలు రహదారులు పూర్తిగా ధ్వంసమైపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రహదారులపై తప్పని పరిస్థితుల్లో ప్రయాణం చెయాల్సి వచ్చి, ఈ గతుకుల రహదారిపై అవ స్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డికి ఒకవైపు అంటే ఎల్లారెడ్డి నుంచి బొగ్గు గడిసె వరకు పూర్తి స్థాయిలో రహదారి ధ్వంసం కావగా, మరోవైపు ఎల్లారెడ్డి శివారులోని ఎంపీడీవో కార్యాలయం నుంచి మెదక్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వరకు హెచ్ఎంబీ ప్రధాన రహదారి చాలవరకు ధ్వంసం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ గుంతలు ఏర్పడడంతో తమ వాహనాలు చెడిపోతున్నాయని, వాహనాల పార్టులు ఊడిపో తున్నాయని, టైర్లు పగిలిపోవడం, పంక్చర్‌లు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రహదారితో పాటు స్పీడు బ్రేకర్లు కూడ ఈ రూట్లో అధికంగా ఉండడంతో ప్రయాణం మరింత ఇబ్బందిగా మారింది. ప్రయాణీకులకు ఇంత ఇబ్బందిగా మారిన ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

## వేగంగా వెళితే ప్రమాదమే కాదు..చలానా కూడా

### -లేజర్ గన్స్‌తో ఖమ్మంలో నజర్

ఖమ్మం,నవంబర్8(ఆర్ఎన్ఎ): వాహనాల్లో రయ్యిమంటూ దూసుకెళ్లే వారికి ఇక నుంచి ఖమ్మంలోనూ జరిమానాలు విధిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్పీడ్ లేజర్‌గన్స్‌ను ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చారు. గతంలో ఖమ్మంలో హెల్మట్, త్రిబుల్‌రైడింగ్, లైసెన్సు, ఇన్సూరెన్సు, పొల్యూషన్ వంటి అంశాలపై కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడు అతివేగంగా వెళ్లేవారికి జరిమానాలు విధించనున్నారు.

వేగంగా వెళ్లేవారిని ఎవరికీ కనపడకుండా రోడ్లపక్కన ఉండి లేజర్‌గన్‌తో క్యాప్చర్ చేస్తారు. ఇది దాదాపు 500 మీటర్ల దూరం పని చేస్తుంది. ఖమ్మం నగర పరిధిలో 40స్పీడ్‌తో మాత్రమే వెళ్లాలి.. కానీ 40స్పీడ్ దాటి వెళుతున్నారు. అలాకాకుండా 40 దాటి 45వరకు వెళ్లినా రూ.1000 జరిమానా కట్టాల్సి ఉంటుంది. బైపాస్‌రోడ్డు పక్కన కాలేజీలు, స్కూల్స్ ఉండడంతో ఆర్అండ్‌బీ అధికారులు 40 స్పీడ్‌తో వెళ్లాలని పలు ప్రాంతాలలో స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేశారు. లేజర్‌గన్ ద్వారా స్పీడ్‌గా వెళుతున్న వాహనాన్ని నెంబరు క్యాప్చర్ చేస్తారు. ఆ వాహన వివరాలు వెంటనే ట్రాఫిక్ పోలీసుల సర్వర్‌కు వెళతాయి. దీంతో వెంటనే చలానా జనరెట్ అవుతుంది. వాహనదారులకు వెంటనే మెసేజ్ కూడా వస్తుంది. అతివేగాన్ని అరికట్టందుకు బాధ్యతలో భాగంగా స్పీడ్‌లేజర్‌గన్ ఆపరేట్ చేసేందుకు ఖమ్మంలో నలుగురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదటిసారిగా ఖమ్మంతోపాటు మిగతా అన్నిజిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకు ఖమ్మంలో ముందుగా ఒక లేజర్ గన్ మాత్రమే అందుబాటులో ఉంది. రానున్న రోజుల్లో ఇంకా స్పీడ్‌గన్నులు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ రకంగావాహనాల వేగ నియంత్రణకు అధికారులు నడుం బిగించారు. అతివేగం కారణంగా ప్రమాదలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పోలీసులు కొత్తగా చలానాలతో పని చెప్పేందుకు సిద్ధమయ్యారు.

## గద్వాల ఆసుపత్రిలో మందుల కొరత

### ప్రైవేట్ ఆసుపత్రిలా తయారైందంటున్న రోగులు

జోగులాంబగద్వాల,నవంబర్8(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రంలో ఉన్న పెద్దాసుపత్రిలో అడుగడుగునా సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ ఆసుపత్రిలో డాక్టర్లతో పాటు మందుల కొరత కూడా తీవ్రంగా ఉన్నది. ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న తర్వాత ఆస్పత్రి వర్గాలు ఒక చీటి ఇచ్చి ఈ మందులు తీసుకురండి అనడం ఇక్కడ సర్వసాధారణం. ఈ మందులు మళ్లీ బయటి దుకాణాలలో కొనాల్సిందే. బడ్జెట్ కొరత వల్ల సెంట్రల్ డ్రగ్స్ నుంచి మందుల కొరత ఉండటం వల్లే మందులు సకాలంలో రావడంలేదని ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. గద్వాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు దాదాపు 700 నుంచి 800 దాకా ఓపీలు చూస్తారు. వీరితో పాటు కొందరు వార్డులలో చికిత్సలు చేయించుకుంటూ ఉంటారు. వీరందరికి మందులు కావాల్సిందే. కానీ ఏవో కొన్ని మందులు మాత్రమే ఆసుపత్రి నుంచి ఇచ్చి మిగితావి బయటకు చిట్టీలు రాసి పంపుతున్నారు. జిల్లా ఏర్పడక ముందు కంటే పరిస్థితి జిల్లా ఏర్పడ్డాక మరీ అధ్వానంగా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మందులకు చిట్టీలు రాసిస్తుండటంతో వారికి ఈ ప్రభుత్వ ఆసుపత్రి కూడా ప్రైవేట్ ఆసుపత్రిలాగానే ఉన్నదని ఆరోపిస్తున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇద్దరు డాక్టర్లు ప్రైవేట్ మెడికల్ స్టోర్‌లతో కుమ్మక్కై ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులను అక్కడికే పంపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు లేవని, ఇక ఎప్పుడు వస్తాయో తెలియదని, వెంటనే ఆ మెడికల్ స్టోర్‌కు వెళ్లి తీసుకురావాలని చెబుతున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ఉన్నమాట వాస్తవమేనని అధికారులు అంగీకరిస్తున్నారు. అయితే సెంట్రల్ డ్రగ్స్‌నుంచి మందుల కొరత వల్లే ఈ సమస్య ఏర్పడింది. దీనికి తోడు అనుకున్నంత స్థాయిలో బ్జడెట్ కూడా లేకపోవడం ఒక కారణమని అన్నారు.

## రైతులను వెన్నాడుతున్న ఖరీఫ్ కష్టాలు

### అకాల వర్షాలతో పంటలకు తీరని నష్టం

జగిత్యాల,నవంబర్8(ఆర్ఎన్ఎ): రైతులను ఖరీఫ్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆరుగాలం శ్రమ ఆవిరైపోతోంది. పంట చేతికందే దశలో కురిసిన అకాల వర్షాలతో పంట నేలపాలు అవుతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వర్షాల వల్ల 30 వేల ఎకరాల్లో ఇప్పటికే పంటలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల మొక్కజొన్న పంట కూడా దెబ్బతినడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. వరిపంట దిగుబడి కూడా బాగా వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈసారి చీడపీడల బెడద కూడా లేకపోవడంతో జిల్లాలో ఆరున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని లెక్కలు వేస్తున్నారు. ఈ మేరకు 320 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇటీవల కురిసిన భారీ వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. అలాగే పెద్ద ఎత్తున మొక్కజొన్న పంటకు కూడా నష్టం వాటిల్లింది. దీంతో రైతులు కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు. పంట చేతికి వచ్చే దశలో నీటిపాలు అవుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురియటంతో పెద్ద ఎత్తున వరి పంట నేలమట్టం కాగా, చాలా చోట్ల పత్తి పంట నీట మునిగింది. కొన్ని చోట్ల మొక్కజొన్న పంట కూడా తడిసి మొదలకెత్తుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టం జరిగినా అధికారులు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అంచనా వేయలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకరిద్దరు నాయకులు పరామర్శించి వెళ్లినప్పటికీ అధికారులు పంట చేలోకి రావడం లేదని ఆరోపిస్తున్నారు.

ఉద్యమకారులకు..

# సముచిత స్థానం లభిస్తుంది

### - రైతులకు ఇబ్బందులు లేకుండా బాధ్యతతో పనిచేయాలి

### - పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రభుత్వం హయాంలో సీఎం కేసీఆర్ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పదవులు అలంకారప్రాయం కాకూడదని అన్నారు.

2014లో తెలంగాణకు విముక్తి జరిగితే.. చొప్పదండి నియోజకవర్గానికి మాత్రం 2018లో విముక్తి జరిగిందన్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా సీఎం కేసీఆర్ వరాలు ఇచ్చినా ఇక్కడ మాత్రం ఉద్యమకారులకు న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యేగా సుంకె రవిశంకర్ ఎన్నికైన తర్వాతనే ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కిందన్నారు. రైతులకు సేవ చేయడానికి దక్కిన అద్భుత అవకాశం మార్కెట్ కమిటీ పదవులు అన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా పాలకవర్గం సభ్యులు బాధ్యతతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు.

# రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాల తొలగింపు

## విద్యుత్ శాఖ చెల్లింపులకు గుట్టుగా ఎసరు?

ఆదిలాబాద్,నవంబర్8(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న స్తంభాల తొలగింపు, టవర్ల బిగింపు పనులు ఎలాంటి ఒప్పందం లేకుండానే ఇరుశాఖల అధికారుల మధ్య రహస్య ఒప్పందంతో అక్రమ పద్ధతిలో జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

తద్వారా లక్షల రూపాయలు ఇరుశాఖల అధికారుల జేబుల్లోకి వెళు తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆదిలాబాద్‌లో జరుగుతున్న పనులకు సంబంధించి అసలు ఎంత మొత్తం, ఎలా జరుగుతున్నాయనే వివరాలు అధికారుల వద్ద చెప్పేందుకు లేవు. జిల్లాలోని ఇచ్చోడ, బోథ్, ఆదిలాబాద్ శివారు ఖానాపూర్‌లోనూ ఇలాంటి పనులే జరగగా, అవికూడా ఒప్పందం లేకుండానే జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సీఎండీ దృష్టి సారించి అధికారుల అవినీతిని ఎండగట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆస్పత్రి నుంచి తిర్పెల్లి వరకు నాలుగు వరుసలుగా ఉన్న పాత ఎన్‌హెచ్ రహదారిని ఆరు వరుసలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా హెచ్‌టీ కరెంటు స్తంభాలను తొలగించి టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల స్తంభాలనే ఉంచి మిగతా చోట్ల టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా వివిధ పనులు కలిపి మొత్తం రూ.44.03 కోట్లతో ఆర్అండ్‌బీశాఖ ఈ పనులు చేపడుతోంది. అయితే విద్యుత్ స్తంభాల తొలగింపు, టవర్ల ఏర్పాటు వంటి పనులకు పైన పేర్కొన్న నిధుల్లోంచే రూ.3 కోట్లతో ప్రత్యేకంగా పనులు చేపడుతున్నారు. ఇక్కడే అవినీతికి తెరలేచింది. ఆర్అండ్‌బీశాఖ పనులు చేపడుతుండగా విద్యుత్‌శాఖకు 10శాతం నిధులను నిర్మాణ ఖర్చుల కింద చెల్లించి చేపట్టాలి. ఇక్కడ ఇరుశాఖల అధికారులు ఒక ఒప్పందం చేసుకొని విద్యుత్‌శాఖ ఆదాయానికి గండిపెట్టి తమ జేబులు నింపుకునేలా అనధికారికంగా పనులు చేపడుతున్నారు. పైగా విద్యుత్‌శాఖ డీఈ ఈ పనులకు సంబంధించి ఆర్అండ్‌బీ నుంచి ఎంబీ రికార్డు చేసి కార్పొరేట్ ఆఫీసుకు నిధులు నేరుగా పంపిస్తారని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. వాస్తవంగా పది శాతం నిధులు, విద్యుత్ అంతరాయానికి సంబంధించిన మొత్తం కలిపి విద్యుత్‌శాఖ ఎస్ఈ ద్వారా ఒప్పందం చేసుకొని చెల్లింపులు జరిపిన తర్వాతే ఈ పనులు చేపట్టాల్సి ఉంటుందని ఆ శాఖాధికారులే చెబుతున్నారు. అదేవిధంగా పనులు జరిగే సమయంలో కరెంటు అంతరాయానికి సంబంధించి ఎంతైతే విద్యుత్‌శాఖకు నష్టం చేకూరుతుందో అంత పనులు చేపట్టే వారినుంచి వసూలు చేయాలి. దీనికి సంబంధించి ముందుగా ఆర్అండ్‌బీ నుంచి విద్యుత్‌శాఖకు దరఖాస్తు చేసుకుంటే దానికి సంబంధించి అంచనా వ్యయం రూపొందించి ఆ వ్యయాన్ని డిమాండ్ నోటీసు ద్వారా పంపిస్తారు. దానికి బదులుగా ఆర్అండ్‌బీ శాఖ ఈ మొత్తాన్ని చెల్లించి ఒక ఒప్పందం చేసుకొని అప్పుడు పనులు చేపట్టాలి.

## వ్యాధుల సంక్రమణపై సర్వే

### ఇంటింటికి వెళ్లి వివరాల సేకరణ

మహబూబ్‌నగర్,నవంబర్8 (ఆర్ఎన్ఎ): అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు సంబంధించి 30 ఏళ్లకు పైబడిన వారితో ఇంటింటికి వెళ్లి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గత ఫిబ్రవరి 1 నుంచి సర్వే చేశారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఈ సర్వేతో వ్యాధి గ్రస్తులను గుర్తించి ముందస్తుగానే వారికి అవగాహన కల్పించి వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం, మరో వైపు వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి సరైన చికిత్స ప్రాథమిక స్థాయిలోనే అందించి మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఈ సర్వేకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంది. ముఖ్యంగా బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధుల బారినపడి మధ్య వయసులోనే 60 శాతం మంది మృతి చెందుతున్నట్లు గుర్తించారు. ఇందుకనుగుణంగా ఈ సర్వేతో వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రాథమిక స్థాయిలో రోగాలను నియంత్రించేందుకు వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో 30 ఏళ్లపై బడినవారి నుంచే వైద్య సిబ్బంది సర్వే చేసి పూర్తి స్థాయి వివరాలను సేకరించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ లక్షణాలపై ఎన్‌సీబీ ప్రోగ్రాం సర్వేను ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి 30 ఏళ్లకు పైబడిన వారితో పూర్తి స్థాయి వివరాలు సేకరించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే వైద్యసేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రాథమిక స్థాయిలోనే రోగం గుర్తించి వైద్యసేవలు అందించడం వల్ల మరణాలు తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

## మహిళల కడుపులో..

# బంగారం తరలింపు

- చైన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఇద్దరిని గుర్తించిన పోలీసులు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మహిళలను కిడ్నాప్ చేసిన దుండగులు
- కడుపులో బంగారం తీసుకొని.. మహిళలను వదిలివెళ్లిన వైనం
- సినిమాను తలపించిన వ్యవహారం
- విచారణ చేపట్టిన పోలీసులు

చెన్నై. నవంబర్7(ఆర్ఎన్ఎ) : గత కొద్ది రోజుల నుంచి చెన్నైలో భారీగా బంగారం పట్టుబడుతోంది. కోట్లల్లో విలువైన బంగారాన్ని అక్రమంగా తరలించేస్తున్నారు. అయితే.. ఈ బంగారం స్థానికంగా ఉన్న వ్యాపారులే చేస్తున్నారా..? లేక వెనుక నుంచి ఎవరైన నడిపిస్తున్నారా..? అంటే దానికి కూడా పలు విస్తుపోయే నిజాలు దొరికాయి. ముఖ్యంగా.. తమిళనాడులోని మధురై, తిరుచ్చి ఎయిర్‌పోర్టులకు పసిడి అక్రమ రవాణా ఎక్కువగా కొనసాగుతోంది. అక్కడికి మాత్రమే ఎందుకు అక్రమ రవాణా చేస్తున్నారనే ప్రశ్న అందరిలోనూ.. మెదులుతోంది. దీనిపై రెక్కీ నిర్వహించిన పోలీసులకు పలు ఆసక్తికర నిజాలు బయటపడ్డాయి. బంగారం తరలించడానికి చిన్న ఎయిర్‌పోర్టులను.. టార్గెట్ చేశారు స్మగ్లర్లు. పెద్ద విమానాశ్రయాల్లో తనిఖీలు ఎక్కువగా ఉండడం, తరచూ బంగారం పట్టుబడుతుండడంతో చిన్న ఎయిర్ పోర్టుల ద్వారా.. స్మగ్లర్లు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కాగా.. గురువారం తాజాగా మరో మాయ లేడీల గుట్టు రట్టైంది.

కడుపులో 3కిలోల బంగారం అక్రమంగా తరలిస్తూ ఇద్దరు మహిళలు అడ్డంగా దొరికిపోయారు. గర్భం దాల్చారేమోనని ముందుగా అధికారులు భావించారు. కానీ అనుమానంతో తనిఖీలు చేయగా అసలు విషయం బయటపడింది. ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ఆస్పత్రికి తరలిస్తుండగా 10మంది దుండగులు కిడ్నాప్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి కడుపులో ఉన్న బంగారాన్ని బయటకు తీసి వారిని వదిలిపెట్టారు. ఈ ఘటన చైన్నై ఎయిర్‌పోర్ట్‌లో జరిగింది. వీడొక్కడే సినిమా తరహాలోనే ఈ బంగారం స్మగ్లింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే.. ఇంత కథ వెనుక ఎవరు ఉన్నారనే విషయం అటు పోలీసులకు, ఇటు జనాలకు ఆసక్తిగా మారింది. అయితే.. ఇంతకు ముందు ఇలాంటి పనులు మలేషియా వాళ్లు చేసేవారు. ఇప్పుడు సింగపూర్ వాళ్లు చేస్తున్నారు.

# జనవరి నుంచి డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ



హైదరాబాద్, నవంబర్ 8: నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలను వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌సిటూ పద్ధతిలో నిర్మించిన కాలనీల్లో లబ్ధిదారుల ఎంపిక ఇదివరకే పూర్తయినందున ముందుగా ఈ కాలనీలను లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించారు. అనంతరం ఖాళీ జాగాల్లో పూర్తయిన కాలనీలను కూడా దశలవారీగా పంపిణీ చేయాలని నిశ్చయించారు.

నగరంలోని పేదల కోసం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఒక లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టగా, సుమారు 11వేల ఇళ్లు పూర్తయ్యాయి. అందులో రాంపల్లి, అహ్మద్‌గూడల్లోని ఖాళీజాగాల్లో నిర్మించినవే దాదాపు పదివేల ఉన్నాయి. ఇవికాకుండా ఇన్‌సిటీ పద్ధతిలో సింఘంచెరువు తండా, గాజులరామారం, అమీన్‌పూర్-1, జమ్మిగడ్డ, ఖిడికీ బూత్ అలీషా, సయద్ సాబ్ కా బాడా తదితర చోట్ల మరో వెయ్యి ఇండ్లు పూర్తయ్యాయి.

పూర్తయిన ఇళ్ల కాలనీలకు విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ రెండు నెలల్లో ఈ సౌకర్యాలు కల్పించి దశలవారీగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ముందుగా ఇన్‌సిటూ కాలనీల్లోని 1000 ఇళ్లను పంపిణీ చేయాలని నిశ్చయించిన అధికారులు, వాటిల్లో మంచినీరు, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.10 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. ఇటీవల పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఇండ్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నగరంలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లకు ఒక్కోదానికి ఇంటికి రూ.7.5లక్షలు, మౌలిక సదుపాయాలకు రూ.1.5లక్షలు కలిపి మొత్తం రూ. తొమ్మిది లక్షల వరకు ఖర్చవుతోంది. ఇందులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 1.5లక్షలు ఇవ్వనుండగా, మిగిలిందంతా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. గ్రేటర్‌లోని పేదల కోసం మొదటి విడుతలో ఒక లక్ష గృహాలను చేపట్టాలని లక్ష్యం నిర్ధారించుకోగా, వాటి నిర్మాణం కోసం దాదాపు రూ. 8.5వేల కోట్లు ఖర్చవుతోంది. కేంద్రం వాటాపోగా మిగిలిన మొత్తం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే వెచ్చిస్తోంది.

మొత్తం 117 ప్రాంతాల్లో లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టగా, దాదాపు 11వేల గృహాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన వాటి నిర్మాణం కూడా 60శాతానికిపైగా పూర్తయింది. కేంద్ర ప్రభుత్వ వాటాకింద రూ. 1500 కోట్లు రావాల్సివుండగా, ఇప్పటి వరకు కేవలం రూ.590కోట్లు మాత్రమే విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

కేంద్ర నిబంధనలతో లబ్ధిదారుల ఎంపికలో జాప్యం

పీఎంఏవై నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, లబ్ధిదారుడు కూడా వాటాదారులుగా ఉండాలి. దీనికోసం ముందే లబ్ధిదారులను ఎంపిక చేసి వారి వాటా నిధులను బ్యాంకులో జమచేయాల్సి వుంటుంది. అంతేకాకుండా, లబ్ధిదారుడి ఆర్థిక స్థితిగతులు, బ్యాంకు ఖాతా నంబరు, ఇంటి యజమానితోపాటు కుటుంబసభ్యుల అందరి ఆధార్ నంబర్లు, ప్రస్తుతం తానుంటున్న ఇల్లుకి సంబంధించి పూర్తి వివరాలు, దేశంలో ఎక్కడా తనకి ఇల్లు లేదని తెలిపే ధ్రువీకరణపత్రం, వార్షిక ఆదాయం, కాంటాక్ట్ నంబరు తదితర అనేక అంశాలను పొందిపర్చి కేంద్రానికి పంపాల్సి ఉంటుంది.

అప్పుడే కేంద్రం పరిశీలించి ఇళ్లను మంజూరు చేస్తుంది. అయితే మన రాష్ట్రంలో ఇండ్లకయ్యే ఖర్చంతా లబ్ధిదారుడితో ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. లబ్ధిదారుడి వాటాతోపాటు వారి వివరాలు లేవని పేర్కొంటూ నిధులను విడుదల చేయకుండా కేంద్రం దాటవేత ధోరణి అవలంబిస్తోంది. వివిధ ప్రాంతాల్లో ఇన్‌సిటూ విధానంలో నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి దాదాపు 30వేలమంది లబ్ధిదారుల వివరాలను అధికారులు సేకరించగా, ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఇంకా పూర్తిచేయాల్సి వుంది. ముందుగా లబ్ధిదారులను ఎంపికచేసి వారి వాటా మొత్తం ఎంతో తేలితేనే తమ వాటా మొత్తాన్ని విడుదల చేస్తామని కేంద్ర అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతున్నట్లు వారు తెలిపారు.

## తన హక్కులకు..

# పోలీసులు భంగం కలిగించారు

- ఎంపీ అన్న కనీస గౌరవం లేకుండా దురుసుగా ప్రవర్తించారు
- పోలీసులపై లోక్‌సభ స్పీకర్‌కు సంజయ్ ఫిర్యాదు
- బాబు అంతిమయాత్ర ఘటన ఫొటోలు, వీడియోలు అందజేత
- విచారించాలని ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌కు స్పీకర్ ఆదేశం

న్యూఢిల్లీ, నవంబర్8(ఆర్ఎన్ఎ) : పార్లమెంటు సభ్యుడిగా తనకు ఉన్న హక్కులకు పోలీసులు భంగం కలిగించారంటూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారు. గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. ఎంపీ అన్న కనీస గౌరవం కూడా లేకుండా తనపై పోలీసులు దురుసుగా దాడి చేశారని స్పీకర్‌కు వివరించారు. కరీంనగర్ ఆర్టీసీ డ్రైవర్ బాబు అంతిమ యాత్రలో పోలీసులు చాలా దారుణంగా ప్రవర్తించారని, దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను అందజేసి, వాటిని పరిశీలించాల్సిందిగా బండి సంజయ్ స్పీకర్‌ను కోరారు. పార్లమెంటు సభ్యుడనైన తన హక్కులకు పోలీసులు భంగం కలిగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్ చార్జి పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, అడిషనల్ డీసీపీ సంజీవ్, ఏసీపీ నాగయ్య, ఇన్స్పెక్టర్ అంజయ్య పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. స్పీకర్ ను కలిసిన సమయంలో బండి సంజయ్ తో పాటు బీజేపీ పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి కామర్స్ బాలసుబ్రమణ్యం కూడా ఉన్నారు. ఎంపీ సంజయ్ ఫిర్యాదుకు స్పీకర్ స్పందించారు. విచారణ చేపట్టాలని ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ సుశీల్ కుమార్ సింగ్‌ను ఆదేశించారు. విచారణ త్వరగా ముగించి నివేదిక సమర్పించాలన్నారు. దాడి చేసిన పోలీస్ అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు ఎంపీ సంజయ్ తెలిపారు.

మరోవైపు బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పై దాడి చేసిన పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్సీ కేసు నమోదు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులుగా సీఎస్, హోంశాఖ కార్యదర్శి, డీజీపీ, కరీంనగర్ సీపీ, దాడి ఘటనలోని పోలీస్ అధికారులను చేర్చింది.

## హుక్కా సెంటర్ల నుంచి లంచాలు

### - ఆరుగురు పోలీసులపై వేటు

హైదరాబాద్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే హుక్కా సెంటర్లపై తెలంగాణ ప్రభుత్వం గతంలోనే నిషేధం విధించినా అనేకచోట్ల గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే పోలీసుల అండతోనే ఈ సెంటర్లు కొనసాగుతున్నాయన్న చేదునిజం తాజాగా వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. హైదరాబాద్ నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న ఓ హుక్కా సెంటర్లకు కొంతమంది పోలీసు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. పోలీసు శాఖ విచారణలో ఈ విషయం వెలుగులోకి రావడంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆరుగురు పోలీసులపై వేటు వేశారు. నగరంలో ఎక్కడ హుక్కా విక్రయాలు జరిగినా సంబంధిత ఎస్‌హెచ్‌ఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ హెచ్చరించారు. అక్రమంగా హుక్కా సెంటర్లు నడుపుతున్న వారి వద్ద లంచాలు తీసుకుని సహకరిస్తూ వస్తున్న గతంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్లో పనిచేసిన ఎస్సైలు కురుమూర్తి, డి.శ్రీను, ప్రస్తుతం పనిచేస్తున్న ఇ.శంకర్, రామకృష్ణ, ఏఎస్సైలు మహమ్మద్ జాఫర్, శామ్యూల్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. వీరంతా రాత్రిపూట విధుల్లో ఉన్నపుడు అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్ల నిర్వాహకులు, అక్కడికి వచ్చే యువకుల నుంచి మామూళ్లు తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్‌కు సమాచారం వచ్చింది. దీనిపై అంతర్గత విచారణ జరిపించగా నిజమేనని తేలింది. దీంతో కమిషనర్ నలుగురు ఎస్సైలు, ఇద్దరు ఏఎస్సైలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండైన ఎస్సై కురుమూర్తి షాహినాజ్ గంజ్, డి. శ్రీను మహంకాళి పోలీస్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నారు.

# ప్రసవానికి వెళితే రూ.5 కోట్ల బిల్లు

### ఒకే కాన్పులో నలుగురు జననం..
### బరువు తక్కువగా ఉండటంతో 2నెలల పాటు చికిత్స
### ÷రిళిజుకు 7లక్షలు.. దీనికి మందులు అదనం

రియాద్,నవంబర్8(ఆర్ఎన్ఎ): విజిటింగ్ వీసాపై భార్యను గల్ఫ్‌కు రప్పించుకోవడం ఆ తెలంగాణ ప్రవాసీయుడికి పెద్ద కష్టమే తెచ్చిపెట్టింది! నెలలు నిండకుండానే ఆమెకు ప్రసవం కావడం.. ఒకే కాన్పులో నలుగురు శిశువులు జన్మించడంతో ఆస్పత్రి బిల్లు రూ.5కోట్లయింది. అంత బిల్లు తానెక్కడ చెల్లించేదంటూ ఆ భర్త లబోదిబోమంటున్నాడు. బాధితుడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మల్లపల్లికి చెందిన సయ్యద్ జహీద్. అతడు కొంతకాలంగా సౌదీలో పనిచేస్తున్నాడు. విజిటింగ్ వీసాపై ఏడాది క్రితం భార్యను సౌదీకి తీసుకొచ్చాడు. అక్కడే ఆమె గర్భం దాల్చింది. ఏడోనెలలోనే నొప్పులు రావడంతో రియాద్‌లోని సులేమాన్ హబీబ్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నలుగురు బిడ్డలకు ఆమె జన్మనిచ్చింది. ఆస్పత్రి ఖర్చుల కోసం ఇప్పటికే దాచుకున్న రూ.4.31లక్షలను జహీద్ చెల్లించాడు. పిల్లలు బరువు తక్కువగా ఉండటంతో ఇన్‌క్యూబెటర్లలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇందుకు ప్రతి శిశువుకు రోజుకు 10వేల రియాళ్ల చొప్పున ఖర్చవుతోంది. అంటే.. రోజుకు నలుగురు పిల్లలకు కలిపి రూ.7లక్షలు ఖర్చవుతోంది. మరో రెండు నెలలయినా పిల్లలను ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స చేయాల్సి ఉందని.. ఆ రకంగా వారికి రూ.4.50 కోట్లు ఖర్చవుతుందని.. దీనికి మందుల ఖర్చు అదనమని వైద్యులు సూచించారు. పాపం.. జహీద్ అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలో తెలియక సాయం కోసం అర్థిస్తున్నాడు. తన భార్య గర్భవతి అని తెలియగానే స్వదేశానికి పంపాలని అనుకున్నానని, అయితే ఎయిర్‌లైన్స్ అధికారులు అనుమతించలేదని.. దీంతో ఇక్కడే ఉంచాల్సి వచ్చిందని వాపోయాడు. ఇటీవల ఏడాది, రెండేళ్ల కోసం విజిటింగ్ వీసాలను సౌదీ ప్రభుత్వం ఉదారంగా జారీచేస్తోంది. దీంతో ఈ వీసాల ద్వారా తెలుగు రాష్ట్రాల నుంచి పెళ్లయిన జంటల రాక పెరిగింది. ఈ క్రమంలోనే జహీద్ జంట ఇక్కడే కాపురం చేసి చిక్కుల్లో పడింది.

## కర్నాటకలో ప్రేమజంట హత్య!

బెంగళూరు,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): కర్నాటకలోని గడగ్ జిల్లాలో ప్రేమజంట హత్య కలకలం సృష్టించాయి. పెళ్లి చేసుకొని నాలుగు సంవత్సరాలు తరువాత ప్రేమజంట గ్రామానికి వస్తే రాళ్లతో కొట్టిచంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దళిత వర్గానికి చెందిన రమేష్ (29), లంబని కులానికి చెందిన రవితో స్నేహం చేసేవాడు. ఈ నేపథ్యంలో రవి చెల్లెలు గంగమ్మను రమేష్ ప్రేమించాడు. ఎవరికి చెప్పకుండా రమేష్ గంగమ్మను పెళ్లి చేసుకున్నాడు. గంగమ్మ దళిత వ్యక్తిని పెళ్లి చేసుకున్నందుకు లంబని కులస్థులు కోపంలో రగిలిపోయి ఆ ప్రేమజంటపై పగపెంచుకున్నారు. గురువారం తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆ జంట తన సొంతూరుకు చేరుకోగానే ఆ జంటపై లంబని కులస్థులు రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం నిందితులు ఊరి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గజేంద్రగడ్ పోలీసులు అధికారులు తెలిపారు.

# సిడ్నీలో "గ్రీన్ ఛాలెంజ్ "



హైదరాబాద్, నవంబర్ 8:రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఛాలెంజ్ ఇప్పుడు రాష్ట్రం, దేశం ధాటి ఆస్ట్రేలియా లో సిడ్నీ నగరంలో టీఆర్ఎస్ విభాగం ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో గ్రీన్ ఛాలెంజ్ చేపట్టారు. తెలంగాణలోని ప్రజలకు దీని ఆవశ్యకతను తెలపటానికి సిడ్నీ లో మొక్కలు నాటారని టీఆర్ఎస్ ఆస్ట్రేలియావిభాగం అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి తెలిపారు .

ఎంపీ సంతోష్ కుమార్ ఛాలెంజ్ స్వీకరించిన మహేష్ బిగల ద్వారా తాను గ్రీన్ ఛాలెంజ్ స్వీకరించి సిడ్నీలో రాజేష్ గిరి రాపోలు అద్వర్యం లో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ డబ్ల్యు ఇంచార్జి ప్రవీణ్ పిన్నమ, సరళ కుమారి , జ్యోతి వద్రేవు , స్వాతి నల్లాన్ , రవి దూపాటి ,లక్ష్మణ చార్యులు నల్లాన్, పరశురామ్ మొతుకుల, జస్వంత్ కొడరపు ,సాంబ శివ రెడ్డి పాల్గొన్నారు

తెలంగాణకు హరితహారం లో భాగంగా ఎంపీ సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఛాలెంజ్ ఒక ఉద్యమంల కొనసాగుతుందని , ఇది ఇలాగే కొనసాగుతూ తెలంగాణ పచ్చదనం, కాలుష్యం లేకుండా ఆరోగ్య ఆకుపచ్చ తెలంగాణ కావాలని కోరుకుంటున్నాని నాగేందర్ రెడ్డి కాసర్ల పేర్కొన్నారు.

# అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

అగ్నిప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. అగ్నిప్రమాదాలతో ఆస్థి,ప్రాణనష్టం జరిగేప్రమాదముందని చెప్పారు.

శుక్రవారంనాడు కరీంనగర్ పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో అగ్నిమాపకశాఖ అధికారులు అగ్నిప్రమాదాలు-నివారణ చర్యలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ కనీస పరికరాలు ఉన్నట్లైతే ఆస్థినష్టం,ప్రాణనష్టం తగ్గించవచ్చున్నారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న అగ్నిప్రమాదాలతో వేలాదికోట్ల ఆస్థినష్టం,ప్రాణనష్టం జరుగుతున్నదని చెప్పారు. అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అన్నివర్గాల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఇంట్లోగ్యాస్‌లీక్ అయితే ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, గ్యాస్‌సిలిండర్ పేలదనే విషయం తెలుసుకోవాలని చెప్పారు. కమీషనరేట్ వ్యాప్తంగా ఉన్న పోలీసులకు ఈ సందర్భంగా శిక్షణ ఇవ్వడంతోపాటు పోలీస్‌స్టేషన్లకు అగ్నిప్రమాదాల నివారణ పరికరాలను అందజేశారు. అగ్నిమాపక అధికారులు ప్రాణాలకు తెగించి నివారణ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వివిధ రకాల అగ్నిప్రమాదాలు నివారణకు తీసుకునే చర్యలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అగ్నిప్రవ రాదాల నివారణ చర్యలను ప్రదర్శించిన అధికారులను కమీషనర్ అభినందించారు. వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన అన్నిస్థాయిల అధికారులకు అగ్నిప్రమాద నివారణ చర్యలపై శిక్షణ ఇప్పించనున్నామని తెలిపారు. అగ్నిమాపకశాఖ డివిజనల్ అధికారి టి వెంకన్న మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. అగ్నిప్రమాదాలు జరిగేందుకు అస్కారం ఉన్న వస్తువులకు దూరంగా ఉండాలని చెప్పారు. వివిధ రకాల భవనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే పద్దతులను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (పరిపాలన) చంద్రమోహన్, ఎస్‌బిఐ ఇంద్రసేన, ఆర్ఐలు మల్లేశం, జానీమియా, జమ్మికుంట ఎస్ఎఫ్ఓ జి శ్రీనివాస్‌లతోపాటుగా పలువురు అధికారులు పాల్గొన్నారు.



## పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటాం

### - మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, నవంబర్8(ఆర్ఎన్ఎ) : అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా ముక్కల్ మండలం నల్లూరు గ్రామ శివారులో వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ.. జిల్లాల్లో ఇప్పటివరకు 22 వేల ఎకరాల్లో వరి పంటకు తాత్కాలికంగా నష్టంవాటిల్లినట్లు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తీసుకునేందుకు ఆదేశాలు జారీచేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంట బీమా ద్వారా బాధిత రైతులకు సహాయం అందేవిధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు ఆందోళన చెందొద్దని.. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఆర్.ఎం.రావు, డీఎం సివిల్ సైప్లై అభిషేక్ సింగ్, జేడీఏ గోవింద్, ఏడీ మార్కెటింగ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతుల ఆత్మహత్య

జయశంకర్ భూపాలపల్లి,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): మహదేవ్‌పూర్ మండలం ఎలికేశ్వరంలో శుక్రవారం ఉదయం విషాద ఘటన జరిగింది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను రాళ్లబండి తాలయ్య(65), రాధమ్మ(60)గా గుర్తించారు. వీరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. శవ పరీక్ష కోసం తాలయ్య, రాధమ్మ మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

సూర్యాపేట,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరఖాత్ గూడెం వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టి ఆగిపోయింది. వెంటనే వెనక ఉన్న కారు బొలెరో వాహనాన్ని వేగంగా ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుడు ఉత్తర ప్రదేశ్ చెందిన వ్యక్తిగా గుర్తించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. లారీ ఢీకొని మెడికో విద్యార్థిని దుర్మరణం చెందిన సంఘటన విశాఖపట్నంలోని పోర్టు రోడ్డులో జరిగింది. మెడికో విద్యార్థిని స్నేహితులతో కలిసి లంబసింగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం.




శుక్రవారం ఫరీదాబాద్‌లో జరిగిన 69 వ బ్యాచ్ ఐఆర్ఎస్ పాసింగ్ అవుట్ పరేడ్ సెరమనీలో పాల్గొని ప్రసంగిస్తున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.

# బీజేపీ ఉచ్చులో పడను: రజనీకాంత్

చెన్నై,నవంబర్8(ఆర్ఎన్ఎ): బీజేపీతో రజినీకాంత్ సత్సంబంధాలు కొనసాగిస్తున్నాడనే ఊహాగానాలు గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన రజినీకాంత్.. బీజేపీ ట్రాప్‌లో తాను పడనంటూ కుండబద్దలు కొట్టారు. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ నూతన కార్యాలయ ప్రాంగణంలో ప్రముఖ దర్శకుడు కే.బాలచందర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రజినీ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణం అయిన రజినీకాంత్‌ను తిరువళ్లవర్ విగ్రహ వివాదంపై స్పందించాలని మీడియా కోరింది. ఘటనపై ఆయన మాట్లాడుతూ.. నాకు కాషాయ రంగు పులమాలని బీజేపీ చూస్తోంది. ఈ విధంగానే తిరువళ్లువర్‌కు కూడా కాషాయరంగు వేయాలని చూస్తున్నారు. నేను బీజేపీ వ్యక్తిని కాదు. నాకు కాషాయ రంగు పులమకండి. తిరువళ్లువర్ లాంటి గొప్ప రచయిత చుట్టూ రాజకీయం చేయకండి. అనవసర వివాదానికి తెరలేవకండి... అని వ్యాఖ్యానించారు. తంజావూరులో ప్రముఖ తమిళ రచయిత తిరువళ్లువర్ విగ్రహానికి హిందూ మక్కల్ కట్చి నేత అర్జున్ సంపత్ కాషాయవస్త్రం కట్టి మెడలో రుద్రాక్ష మాలను వేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై తమిళనాట పెనుదుమారం రేగింది. ఇదిలా ఉండగా.. ఈ ఘటన బీజేపీ ప్రోద్బలంతోనే జరిగిందన్న రీతిలో రజినీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తమిళనాడులో చర్చనీయాంశంగా మారాయి. ఆధ్యాత్మిక రాజకీయాలు చేస్తానంటూ రజినీ గతంలో చేసిన ప్రకటనలతో ఆయన బీజేపీకి దగ్గరవుతున్నారన్న ఊహాగానాలు తెరపైకొచ్చాయి. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇవన్నీ పుకార్లేనని స్పష్టం చేశాయి. అయోధ్య కేసులో కోర్టు తీర్పుపై ఆయన స్పందిస్తూ.. తీర్పు ఎలా వచ్చినప్పటికీ ప్రజలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు.

## ఏసిబికి చిక్కిన గూడూరు తహసిల్దార్ హాసీనాబీ

కర్నూలు,నవంబర్8(ఆర్ఎన్ఎ): భూ సమస్య పరిష్కారం కోసం ఓ వ్యక్తి వద్ద నుంచి రూ. 4 లక్షలు లంచాన్ని డిమాండ్ చేసిన కర్నూలు జిల్లా గూడూరు తహసిల్దార్ హాసీనాబీ ఏసిబి కి దొరికిపోయిన వైనం శుక్రవారం చోటు చేసుకుంది. గూడూరుకు చెందిన సురేష్ అనే వ్యక్తి తన భూ సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ హాసీనాబీ ని నెల క్రితం కార్యాలయంలో సంప్రదించాడు. అయితే భూ సమస్య పరిష్కారం కోసం తనకు రూ.4 లక్షలు లంచంగా ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేయడంతో కలత చెందిన సురేష్ ఏసీబీ ని ఆశ్రయించాడు. ఆ తర్వాత తహసీల్దార్ కోరిన మేరకు రూ. 4 లక్షలు తీసుకొని గురువారం రాత్రి పాణ్యం బస్టాండ్ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే తహసీల్దార్ తాలూకు చెందిన మహబూబ్ భాష అనే వ్యక్తి సురేష్ నుంచి సొమ్ము తీసుకునే యత్నంలో ఉండగా, అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ నాగభూషణం నేతృత్వంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మహబూబ్ భాషను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తహసీల్దార్ ఆదేశించిన మేరకు ఆ సొమ్ము ను తీసుకునేందుకు వచ్చినట్లు మహబూబ్ బాషా ఏసీబీ అధికారులకు వెల్లడించారు. ఈ ఘటన తర్వాత తహసీల్దార్ హాసీనాబీ ని అరెస్టు చేసేందుకు ఏసీబీ అధికారులు యత్నించగా విషయం తెలుసుకున్న ఆమె అప్పటికే పరారైనట్లు అధికారులు తెలిపారు. గతంలో ఈమె నంద్యాల డిప్యూటీ తహసీల్దార్ గా కూడా పని చేశారు.

# ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్‌గా శ్రీనాథ్ దేవిరెడ్డి

అమరావతి,నవంబర్8(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్‌గా శ్రీనాథ్ దేవిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిజం వృత్తిలో అపార అనుభవం ఉన్న శ్రీనాథ్ వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కొవరంగుట్టపల్లి గ్రామ వాస్తవ్యులు. ఆంధ్రప్రభ ద్వారా 1978లో జర్నలిజం వృత్తిలో చేరిన శ్రీనాథ్ దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కొనసాగారు. కడప జిల్లాలో పనిచేసినప్పుడు రాయలసీమ వెనుకబాటుకు సంబంధించి రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై 'సెవెన్ రోడ్స్ జంక్షన్' పేరుతో ఆయన రాసిన కాలమ్స్ విశేషప్రాచుర్యం పొందాయి. 1990వ దశకంలో ఆయన కొన్నేళ్లపాటు బీబీసీ రేడియోకు పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(ఏపీయూడబ్ల్యూజే) కడప జిల్లా అధ్యక్షుడిగా దాదాపు 24 సంవత్సరాలు పనిచేశారు. ఆ తర్వాత ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. శ్రీనాథ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహిత జర్నలిస్టు కూడా.

మరోవైపు, ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనాథ్ దేవిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాలన్న సీఎం జగన్ ఆశయ సాధన దిశగా పనిచేస్తానని ఆయన చెప్పారు. డిజిటల్ యుగంలో మీడియా రంగంలో పెరిగిన ఆధునిక సాంకేతిక వినియోగం, అలాగే సోషల్ మీడియా విస్తృతి నేపథ్యంలో ముఖ్యంగా గ్రామీణ జర్నలిస్టులకు సరైన దిశగా పునశ్చరణ అవసరమని, అందుకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

# నాలుక మడత పెట్టడంలో తండ్రిని మించి పోయాడు..!

అమరావతి, నవంబర్ 8: పది వేల లోపు డిపాజిట్ చేసి మోస పోయిన 3.7 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిధులు పంపిణీ చేసి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట నిలుపుకున్నారు. మీకిది కనిపించట్లేదా చంద్రబాబు. కుక్కలను ఉసిగొల్పి మొరిగించే బదులు ఇలాంటి మంచి పనులను ప్రశంసిస్తే హుందాగా ఉంటుందని వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి విమర్శించారు. ట్విటర్లో పలు అంశాలపై తీవ్రస్థాయిలో స్పందించారు.

'మీ పిల్లల్ని మాత్రం ఇంగ్లిష్ మీడియంలోనే చదివిస్తారు. పేద పిల్లలు మాత్రం తెలుగులోనే చదవాలి. వాళ్లు ఉన్నత స్థాయికి ఎదగ కూడదు. విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్ల కూడదని కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు తండ్రీ కొడుకులు. దేవాన్ష్ ను తెలుగుమీడియంలో చదివిస్తామని చెప్పండి చూద్దాం?. స్కూళ్ళలో చైనీస్, జపనీస్ భాషలను కూడా నేర్పించాలని చంద్రబాబు వకాల్తా పుచ్చుకున్న విషయం మాలోకానికి తెలిసి ఉండదు. ఎవరైనా పాత వీడియోలు చూపించి కాబోయే పార్టీ అధ్యక్షుడికి జ్ఞానం ప్రసాదించండి కాస్త. నాలుక మడత పెట్టడంలో తండ్రిని మించి పోయాడు. మానసిక పరిణితి లేని సొంత పుత్రుడు, దత్త పుత్రుడిని, కుల మీడియాను ప్రజల మీదకు వదిలాడు చంద్రబాబు. ఎవరు ఏం వాగుతున్నారో, ఎందుకు మాట్లాడుతున్నారో వాళ్లకే అర్థం కాని పరిస్థితి. ఎన్నికల్లో ప్రజల చేతిలో చావు దెబ్బలు తిన్న తర్వాత కూడా బాబు ఉ కంపెనీకి బుద్ధి రాలేదని' విజయ సాయిరెడ్డి మండిపడ్డారు.

# ఎల్‌కే అద్వానీకి మోదీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,నవంబర్8(ఆర్ఎన్ఎ): భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ 92వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, వర్కింగ్ ప్రెసిడెంట్ జయ ప్రకాశ్ నడ్డా స్వయంగా ఎల్‌కే అద్వానీ నివాసానికి చేరుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఎల్‌కే అద్వానీకి పార్టీ సీనియర్లు, ఆయన అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.




శుక్రవారం 92వ వసంతంలోకి అడుగుపెట్టిన బిజెపి అగ్రనేత ఎల్‌కే అద్వానీకి ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోడి.

# మాట మార్చిన పాకిస్థాన్.. ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిందే..

న్యూఢిల్లీ, నవంబర్ 8: గురు నానక్ 550వ జయంతి సందర్భంగా ఈ నెల 9వ తేదీన కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. అయితే కర్తార్‌పూర్ కారిడార్ మీదుగా పాకిస్థాన్‌లోకి తొలి రోజు వచ్చే యాత్రికులకు ఎలాంటి ప్రవేశ రుసుం వసూలు చేయబోమని పాకిస్థాన్ నవంబర్ 1వ తేదీన ప్రకటించింది. ఈ విషయంలో పాకిస్థాన్ మాట మార్చింది. కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవం రోజున ఒక్కొక్కరికి 20 డాలర్ల చొప్పున ప్రవేశ రుసుం వసూలు చేస్తామని పాక్ స్పష్టం చేసింది.

గురునానక్ 550వ జన్మదినోత్సవం సందర్భంగా సంవత్సర కాలంపాటు భారత సిక్కు యాత్రికులు పాస్‌పోర్టు లేకుండానే కర్తార్‌పూర్‌ను సందర్శించవచ్చు. అలాగే, కర్తార్‌పూర్‌కు వచ్చే భారత యాత్రికుల వివరాల్ని 10 రోజుల ముందుగానే మాకు భారత్ తెలియజేయాలన్న నిబంధనను కూడా సడలిస్తున్నాం.

దీంతోపాటు నవంబర్ 9, 12 తేదీల్లో కర్తార్‌పూర్ సందర్శనకు భారత యాత్రికులు చెల్లించాల్సిన 20 డాలర్ల ఫీజును కూడా వసూలు చేయం అని పాక్ విదేశీ కార్యాలయం ప్రతినిధి మహమ్మద్ ఫైజల్ గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఒక్క రోజులోనే పాకిస్థాన్ మాట మార్చడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కర్తార్ పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి భారత్ నుంచి 550 మంది ప్రముఖులు హాజరు కానున్నారు.

సిక్కుల మత గురువు గురు నానక్‌కు చెందిన గురుద్వారా దర్బార్ సాహిబా ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్నది. అయితే ప్రతి రోజూ 5 వేల మంది సిక్కులు ఆ గురుద్వార్‌వ వెళ్లేందుకు పాకిస్థాన్ అనుమతి ఇచ్చింది. గురు నానక్ తన చివరి 18 ఏళ్ల జీవితాన్ని గురుద్వారా దర్బార్ సాహిబ్‌లోనే గడిపారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో ఉన్న నరోవల్ జిల్లాలో ఈ గురుద్వారా ఉన్నది. ఇది అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది.

## తెలంగాణ దేశానికి ఆదర్శం: మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్,నవంబర్8(నేటినిజం ప్రతినిధి): ప్రజా సంక్షేమ పథకాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన కార్యకర్తలను గుర్తిస్తున్నాం. కార్యకర్తలకు తగిన భాద్యతలు అప్పగిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితులు మారిపోయాయి. గత ఖరీఫ్ సీజన్ లో కంటే ఈ ఖరీఫ్ సీజన్ లో ధాన్యం దిగుబడి పెరిగింది. నెల రోజుల ముందుగానే ముఖ్యమంత్రి కేసిఆర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను అప్రమత్తం చేసి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసారు. ఏళ్లకు ఏళ్లు రాజకీయ అనుభవం ఉన్నవాళ్లు, మంత్రులుగా పని చేసి వాళ్లు అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారు. బిజెపి అధ్యక్షునిగా లక్ష్మణ్ భాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పార్టీ సర్వనాశనం అయ్యింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 105 స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్ రాలేదు. హుజూర్ నగర్ ఉ పఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థికి ఇండిపెండెంట్ కు వచ్చిన ఓట్లు రాలేదు. రాష్ట్ర అభివృద్ధి టిఆర్ఎస్ పార్టీ తోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారు అనడానికి హుజూర్ నగర్ ఫలితమే నిదర్శనమని పేర్కొన్నారు

## ఆ యాచకురాలు లక్షాధికారి

పుదుచ్చేరి,నవంబర్8(ఆర్ఎన్ఎ): పేరుకే ఆమె యాచకురాలు. కాని ఆమె బ్యాంకు ఖాతాలో రూ. 2 లక్షల డిపాజిట్ ఉంది. ఆమె చేతి సంచిలో రూ. 15,000 నగదు ఉంది. పుదుచ్చేరిలో ఒక గుడి బయట యాచన చేసి జీవిస్తున్న పర్వతం అనే 70 ఏళ్ల వృద్ధురాలి వద్ద ఉన్న డబ్బును చూసి ఆ గుడి అధికారులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల గుడి ఆవరణను శుభ్రం చేయడానికి ఆలయ సిబ్బంది ప్రయత్నిస్తున్న సమయంలో ఆ వృద్ధురాలిని అక్కడి నుంచి బయటకు వెళ్లాలని వారు కోరారు. అయితే అందుకు ఆమె నిరాకరించింది. బలవంతంగా ఆమెను గుడి బయటకు పంపే ప్రయత్నంలో ఆమె చేతి సంచిలో నుంచి నగదు బయటపడింది. ఆమె వద్ద ఉన్న బ్యాంకు పాస్‌బుక్‌లో రూ. 2 లక్షలు డిపాజిట్ ఉన్నట్లు కనిపించింది.

కేవలం భక్తుల వద్ద యాచించి ఇంత నగదును ఆమె సంపాదించడం ఆలయ సిబ్బందిని కూడా విస్మయానికి గురిచేసింది. ఆమె బ్యాగులో లభించిన ఆధార్ కార్డ్ ఆధారంగా తమిళనాడులోని కల్లకురిచి గ్రామంలో నివసిస్తున్న ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే అక్కడ నుంచి సమాధానం లేకపోవడంతో ఆమెను ఒక వృద్ధాశ్రమంలో చేర్పించారు.

## పోలీసులకు ధైర్యముంటే..

# జగన్ పై రౌడీషీట్ తెరవండి

**– తప్పుడు కేసులతో టీడీపీ కార్యకర్తలను ప్రభుత్వం వేధిస్తుంది**

**– తప్పుడు కేసులతు పెడితే పోలీసులు, రెవెన్యూ సిబ్బందిపై తిరిగి కేసులు పెడతాం**

**– స్థానిక కోర్టు నుంచి సుప్రింకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తాం**

**– మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు**

చిత్తూరు, నవంబర్8(ఆర్ఎన్ఎ) : పోలీసులకు ధైర్యముంటే సీఎం జగన్ పై రౌడీషీట్ ఓపెన్ చెయ్యాలని టీడీపీ అధినేత, మాజీ సీఎం పోలీసులకు సవాల్ విసిరారు. తప్పుడు కేసులు పెట్టి టీడీపీ కార్యకర్తలను ప్రభుత్వం వేధిస్తోందని చంద్రబాబు వాపోయారు. రెండో రోజు గురువారం చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా టీడీపీ శ్రేణులతో బాబు సమావేశమయ్యారు. వేధింపుల గురించి పుంగనూరు టీడీపీ నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతున్నారని.. రౌడీ షీట్ తెరిచారని చంద్రబాబు ముందు వాపోయారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. జగన్ తీరుపై, వైకాపా నేతలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్యకర్తలను వేధించడం సరికాదన్నారు. సొంత బాబాయ్ ని ఇంట్లో చంపేస్తేనే దిక్కు లేదు కానీ, చేయని తప్పులకు టీడీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఇంతవరకు వైఎస్ వివేకా హత్య కేసుకి సంబంధించి ఎలాంటి ప్రొగ్రెస్ లేదన్నారు. జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామిని చంద్రబాబు హెచ్చరించారు. జగన్ ఎప్పుడు ఏ పదవి తీసేస్తాడో ఆయనకే తెలియదన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉన్మాదిలా మారొద్దని వార్నింగ్ ఇచ్చారు.

అక్రమ కేసులపై స్థానిక కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. ప్రతిపక్షాలను వేధించడం మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. చట్ట ముందు అందరూ సమానమేనని చంద్రబాబు చెప్పారు. అట్రాసిటీ కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. రౌడీ షీట్‌కు సంబంధించి నిపుణులు పరిశీలించి.. కోర్టులను ఆశ్రయిస్తామని చెప్పారు. స్థానిక కోర్టు, సెషన్స్ కోర్టు, హైకోర్టు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని చంద్రబాబు స్పష్టంచేశారు. టీడీపీ శ్రేణులపై కేసులు పెట్టినవారిని వదిలిపెట్టబోమని చంద్రబాబు హెచ్చరించారు. తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టిన పోలీసులు, రెవెన్యూ సిబ్బందిపై తిరిగి కేసులు పెడతామని తేల్చిచెప్పారు. సిద్ధాంతపరంగా ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం పోరాటం చరిత్రలో నిలుస్తుందని చంద్రబాబు అన్నారు. లా అండ్ ఆర్డర్ గురించి డీజీపీ..తనకు తాను సర్టిఫికెట్ ఇచ్చుకోవడం సరికాదన్నారు. వీసీలను కూడా బెదిరించి రాజీనామాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. జైలుకు వెళ్లొచ్చినా జగన్..అందరినీ జైలుకు పంపాలని చూస్తున్నారని చంద్రబాబు విమర్శించారు.

# ఖైదీ భార్యపై జైలు పోలీసుల అత్యాచారం

భోపాల్,నవంబర్8(ఆర్ఎనఎ): జైల్లో ఉన్న భర్తను కలిసేందుకు వెళ్లిన ఓ మహిళ సామూహిక అత్యాచారానికి గురైంది. ఇద్దరు జైలు కాపాలాదారులు..మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధ్యప్రదేశ్ రాజ్‌గఢ్ ప్రాంతంలో నవంబర్ 1న ఈ దారుణం జరిగింది. బాధితురాలు రాజ్‌గఢ్ జిల్లా ఖేద్‌వార్ గ్రామంలో నివసిస్తుంటుంది. ఆమె భర్త సారంగ్‌పూర్ సబ్ జైల్‌లో శిక్షను అనుభవిస్తున్నాడు. అయితే భర్తను చూసేందుకు ఆమె తరచూ జైలుకు వెళుతుండేది. ఈ క్రమంలో..హరిరామ్, మాలీసింగ్ అనే ఇద్దరు జైలు కాపలాదారులతో ఆమెకు పరిచయం ఏర్పడింది.

కాగా..భర్తకు ఆరోగ్యం బాగాలేదని వారు నవంబర్ 1 అర్థరాత్రి సమయంలో బాధితురాలికి వారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సారంగ్‌పూర్ ఆసుపత్రికి రావాలని చెప్పారు. ఫోన్‌లోనే రూట్ చెప్తామన్నారు. ఈలోపు..తను తమ్ముడిగా భావించే రామచంద్ర అనే వ్యక్తితో ఈ విషయాన్ని చెప్పింది. తనతో పాటు తోడుగా రమ్మని కోరింది. రామచంద్ర.. తనతో పాటు మేనల్లుడిని వెంట తీసుకురాగా..ముగ్గురూ కలసి ఆసుపత్రికి బయలు దేరారు. ఏ రూట్‌లో రావాలో వారికి కాపలాదారులు ఫోన్‌లో చెప్పారు. వారు కిథోర్ అనే ప్రాంతం చేరుకునే సరికి..హరిరామ్, మాలీసింగ్‌లు వారికి ఎదురుపడ్డారు. బాధితురాలిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు.

వారు వెళ్లిపోయిన తరువాత..రామచంద్ర, అతడి మేనల్లుడు కూడా బాధితురాలిపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. కాగా..ఈనెల 6న సదరు మహిళ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నలుగురు నిందితులపై అత్యాచారం కేసు నమోదు చేసిన పోలీసులు..వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ,నవంబర్8(ఆర్ఎన్ఎ): తూర్పు గోదావరి : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున అమలాపురం రూరల్ మండలంలో చోటు చేసుకుంది. తూర్పు గోదావరి అమలాపురం రూరల్ మండలం కామనగరువు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పారుపూడి జోసెఫ్ (26) మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడు పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళకూరు మండలం కాళ్ళకూరు గ్రామానికి చెందిన జోసెఫ్ గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు

## బాలచందర్ విగ్రహావిష్కరణలో రజనీకాంత్, కమల్

చెన్నై,నవంబర్8(ఆర్ఎన్ఎ): చెన్నైలోని రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ ఆఫీస్ పరిధిలో బాలచందర్ విగ్రహాన్ని కమల్, రజనీకాంత్ కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. రాజకీయాలలోకి వచ్చిన కమల్ సినిమాని ఏ నాడు మరవలేదు. తన ప్రతిభని చూపిస్తూనే ఉన్నాడు అని చెప్పుకొచ్చారు. గురువారం కమల్ హాసన్ బర్త్‌డే కావడంతో ఆయన పుట్టిన రోజు వేడుకలతో పాటు 60 ఏళ్ళసినీ ప్రస్థానానికి జ్ఞాపకంగా మూడు రోజుల వేడుక నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా కమల్ తన తండ్రి శ్రీనివాసన్ విగ్రహాన్ని పరమక్కుడిలో ఆవిష్కరించారు. ఇవాళ చెన్నైలోతన సినీ గురువు కె. బాలచందర్ విగ్రహావిష్కరణ చేసారు కమల్. ప్రస్తుతం కమల్ భారతీయుడు 2 చిత్రంతో బిజీగా ఉండగా, రజనీకాంత్ దర్బార్ చిత్రం చేస్తున్నారు.

## హిమాచల్ అభివృద్ధిపై మోడీ ప్రశంసలు

ధర్మశాల,నవంబర్7(ఆర్ఎన్ఎ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో పర్యటిస్తున్నారు. ఆ రాష్ట్ర సీఎం జైరాం థాకూర్, కేంద్ర పర్యాటకశాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ ప్రధానికి పుష్పాలతో స్వాగతం పలికారు. ధర్మశాలలో జరుగుతున్న రైజింగ్ హిమాచల్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ భేటీని ప్రధాని మోదీ ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా హిమాచల్ ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని గడిచిన రెండేళ్లలో హిమాచల్ ప్రదేశ్ గణనీయ అభివృద్ధిని సాధించిందన్నారు.

## పులికాట్ సరస్సులో పడిన బస్సు.. 20 మందికి గాయాలు

అమరావతి,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): అదుపు తప్పి ఆర్టీసి బస్సు పులికాట్ సరస్సులో బోల్తా పడిన సంఘటన నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది.

బస్సు 80 మంది ప్రయాణికులతో వెళుతుండగా సూళ్లూరుపేట నుంచి కొరిడి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 20 మంది తీవ్రంగా గాయపడినట్టు సమాచారం. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు సమాచారం.

## కేంద్రం నిర్ణయాలతో..

# దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలోపడింది

**– మహిళల ఆర్థిక స్వావలంబనకై తీసుకుంటున్న చర్యలు శూన్యం**

**– రెండేళ్లలో మహిళలపై దాదాపు 38000 అకృత్యాలు**

**– సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్**

విజయవాడ, నవంబర్8(ఆర్ఎన్ఎ) : కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారి పోయేలా ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. శుక్రవారం విజయవాడ వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు.. ఓ మహిళ ఆర్థిక మంత్రి పదవి చేపట్టినప్పటికీ మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ఆమె తీసుకుంటున్న చర్యలు శూన్యమని విమర్శించారు. గత రెండేళ్లలో మహిళలపై దాదాపు 38000 అకృత్యాలు జరిగాయన్నారు. నేను జాతీయ నేర గణాంక లెక్కల ప్రకారమే ఈ వివరాలు చెబుతున్నానని, కొన్ని రాష్ట్రాల్లో ఏకంగా ఎమ్మెల్యేలపై అత్యాచార కేసులు నమోదు అయ్యాయన్నారు. వీరిలో కొంత మంది స్వామిజీలు కూడా ఉన్నారని నరేంద్ర మోదీ సర్కారు తీరుపై ధ్వజమెత్తారు. నోట్ల రద్దు తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ మీద కోలుకోలేని దెబ్బ పడిందన్నారు. గత 60 ఏళ్లుగా ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదని విమర్శించారు. ' గ్రామీణ భారత దేశం పనులకోసం ఎదురు చూస్తుంది. బీజేపీ హయాంలో భారతదేశం నేర దేశంగా ఎదుగుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఆకలితో అలమటించే వారి సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా.. మోదీ సర్కారు తలాక్ బిల్లుపై చూపిన శ్రద్ధ మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు చూపడం లేదని బృందాకారత్ ప్రశ్నించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు అధికార పార్టీ నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కాగా నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు సీపీఎం ఆధ్వర్యంలో మహిళా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు బృందాకారత్ తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

## ఆరేళ్ల చిన్నారి హత్య

చిత్తూరు,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): కొరబలపేట మండలం చేనేతనగర్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. తన తల్లిదండ్రులతో కలిసి పెళ్లి వేడుకలకు వచ్చిన వర్షిత (6) అనే చిన్నారిని దుండగులు హత్య చేశారు. తల్లిదండ్రులతో కలిసి గురువారం రాత్రి పెళ్లి వేడుకలకు వచ్చిన వర్షిత అదృశ్యమైంది. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వర్షిత కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వర్షిత మృతదేహం కల్యాణమండపానికి సమీపంలో శుక్రవారం ఉదయం లభ్యమైంది. మృతురాలి స్వస్థలం బి.కొత్తపేట మండలం గుట్టపాలెం అని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం కోసం చిన్నారి వర్షిత మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.వ్యక్తిని హత్య చేసి తగులబెట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కడప జిల్లా ఉజంపేట ఎన్టీఆర్ విగ్రహం దగ్గర బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. హత్య చేసి తగులబెట్టినట్టు ఆనవాళ్లున్నాయి. మృతదేహం దాదాపు 50 శాతం మంటల్లో కాలిపోయింది.

## ఏపీ గవర్నర్‌తో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

విజయవాడ,నవంబర్ 8(ఆర్ఎన్ఎ): రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ అయ్యారు. కేంద్ర మంత్రిని రాజ్‌భవన్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో ధర్మేంద్ర ప్రధాన్ విభిన్న అంశాలను చర్చించారు. రాష్ట్రానికి రావల్సిన నిధులు, ప్రాజెక్టులపై శ్రద్ధ తీసుకోవాలని కేంద్ర మంత్రిని గవర్నర్ కోరారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com